# పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 10 సంచిక : 41 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ గురువారం 15 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME 10 ISSUE :41 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA THU 15 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## జనసేనలో చేరిన వంగవీటి రాధా.. విజయవాడ మేయర్ రేసులో ఉంటారా?



- కండువా కప్పి ఆహ్వానించిన పవన్ కల్యాణ్
- విజయవాడ మేయర్ రేసులో రాధా పేరు
- జనసేనలో చేరిన తిరుపతికి చెందిన ప్రణీత్ ప్రమోద్
- విజయవాడలో 35 డివిజన్లు జనసేన కోరుతున్నట్లు సమాచారం
- కూటమి సీట్ల సర్దుబాటుపై కొనసాగుతున్న చర్చలు

పెన్ పవర్ డెస్క్:మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ జనసేన పార్టీలో చేరారు. బుధవారం అమరావతిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. తిరుపతికి చెందిన ప్రణీత్ ప్రమోద్ కూడా జనసేనలో చేరారు.

- మిగతా 2లో




**ఆంధ్రప్రదేశ్‌లో ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా బుధవారం విజయవాడలో ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు.**



పెన్ పవర్ డెస్క్: ఈ ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమల్లోకి వచ్చింది.తొలి విడతలో భాగంగా 100 పట్టణ స్థానిక సంస్థలకు (ఖుదీ) ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలు ఉన్నాయి. ఈ నెల 16 నుంచి 18 వరకు నామినేషన్లు స్వీకరించనుండగా, 19న పరిశీలన, 21న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అక్టోబర్ 28న పోలింగ్ నిర్వహించి, 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు.రెండో విడతలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 3న పోలింగ్, 5న ఫలితాలు వెల్లడిస్తారు. ఇక మూడో విడతలో గ్రామ పంచాయతీలకు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తారు. నవంబర్ 26, 29, డిసెంబర్ 2 తేదీల్లో పోలింగ్, లెక్కింపు ప్రక్రియ పూర్తి చేస్తారు. రిజర్వేషన్లపై న్యాయపరమైన చిక్కుముడులు వీడి, ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేయడంతో ఎన్నికల ప్రక్రియకు మార్గం సుగమమైంది.



## బెజవాడ దుర్గమ్మను దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

- విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు
- గన్నవరం విమానాశ్రయంలో రాష్ట్రపతికి ఘన స్వాగతం పలికిన ప్రముఖులు
- ఆలయంలో వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్న రాష్ట్రపతి
- దర్శనం కోసం వేచి ఉన్న భక్తులను ఆప్యాయంగా పలకరించిన ముర్ము

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బుధవారం విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్న వేళ ఆమె అమ్మవారి సన్నిధికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ పర్యటన కోసం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కమలేశ్ పాశ్వాన్, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, ఎంపీ వల్లభనేని బాలశౌరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు ఆమెకు స్వాగతం పలికారు.అనంతరం ఇంద్రకీలాద్రికి చేరుకున్న రాష్ట్రపతికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రాష్ట్ర హోంమంత్రి అనిత, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ఆలయ ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్ ఆమెను ఆలయంలోకి ఆహ్వానించారు. గర్భాలయంలో

- మిగతా 2లో



## విజయనగరం జడ్పీ రేసులో బొత్స సత్యనారాయణ కూతురు అనూష?

- టీడీపీలోకి వెళ్లిన మేనల్లుడు చిన్న శ్రీనుకు చెక్ పెట్టే వ్యూహం
- బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో మారిన సమీకరణాలు
- చిన్న శ్రీను కూడా తన కుమార్తెను బరిలోకి దించనున్నట్లు ప్రచారం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో విజయనగరం జిల్లా రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా జెడ్పీ చైర్‌పర్సన్ పీఠం కోసం వైసీపీ కొత్త వ్యూహానికి పదును పెడుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే వైసీపీని వీడి టీడీపీలో చేరిన తన మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)కి రాజకీయంగా చెక్ పెట్టేందుకు,

- మిగతా 2లో

## ప్రజాబలంపై కాదు.. పోలీసు బలంపై ఆధారపడ్డారు

- స్థానిక ఎన్నికల్లో ప్రభుత్వం పోలీసులను వాడుకుంటోందని కన్నబాబు ఆరోపణ
- కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా అభ్యర్థులను అడ్డుకుంటున్నారని విమర్శ
- వైసీపీ కార్యకర్తలపై పాత కేసులు పెట్టి వేధిస్తున్నారని మండిపాటు

- మిగతా 2లో



## జగన్ అక్రమాస్తుల కేసులపై కీలక పరిణామం.. ఇక రోజువారీ విచారణ

- జగన్ ఈడీ కేసులపైనా ఇక రోజువారీ విచారణ
- విచారణ వేగవంతం చేయాలని సీబీఐ కోర్టు నిర్ణయం
- జగన్‌తో పాటు 70 మంది నిందితుల వ్యక్తిగత విచారణ
- పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 9 ఈడీ ఛార్జిషీట్లు

పెన్ పవర్ డెస్క్:మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల కేసుల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆయనపై ఉన్న సీబీఐ కేసులతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్

- మిగతా 2లో



## ఢిల్లీలో అక్టోబర్ 16న ‘తిరంగా’ నిరసన..

### కొత్త ఆందోళనకు అభిజీత్ దీప్కే పిలుపు

- సాయంత్రం 5 గంటలకు సెంట్రల్ పార్క్‌లో కార్యక్రమం
- నిరసనకు ‘లెహ్రా దో తిరంగా’ పేరు
- సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాల అరెస్టుకు నిరసనగా కార్యక్రమం
- అజింక్య షిండే వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల
- స్థానికంగా తిరంగా మార్చ్‌లు నిర్వహించాలని దీప్కే పిలుపు



పెన్ పవర్ డెస్క్:తమ పార్టీ సహ కన్వీనర్లు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ అక్టోబర్ 16న ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో త్రివర్ణ పతాక

- మిగతా 2లో



## జర్మనీలో ఘోర అగ్నిప్రమాదం.. ముగ్గురు భారతీయుల సజీవ దహనం

- జర్మనీలోని బోచుమ్ నగరంలో ఘోర అగ్నిప్రమాదం
- ఘటనలో ముగ్గురు భారతీయులు మృతి
- మృతుల్లో ఇద్దరు యువతులు, ఒక యువకుడు
- ఐదుగురికి గాయాలు, ఆసుపత్రికి తరలింపు
- హత్య అనుమానంతో ఓ వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు

పెన్ పవర్ డెస్క్:జర్మనీలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో ముగ్గురు భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. బోచుమ్ నగరంలోని

- మిగతా 2లో

## పాక్ సహా 31 దేశాల పైలట్లపై ‘ఎయిర్ ఫ్రాన్స్’ నిషేధం

- ఇజ్రాయెల్ వెళ్లే విమానాల్లో 31 దేశాల సిబ్బందిపై నిషేధం
- ఇజ్రాయెల్ నిబంధనలను పాటిస్తున్నట్లు ప్రకటించిన ఎయిర్ ఫ్రాన్స్
- ఫ్లైదుబాయ్ విమానం హైజాక్ యత్నం తర్వాత కఠిన నిర్ణయం
- ఈ నిర్ణయం ఫ్రెంచ్ ఉపాధి చట్టాలకు విరుద్ధమంటూ ఆందోళనలు

- మిగతా 2లో






## భారత్ ఎదుగుదలను మేమే పరిమితం చేసుకోలేం

పెన్ పవర్ డెస్క్:భారత్‌ను ‘మధ్యస్థాయి శక్తి’ అని పిలవడం సరికాదని, ఆ నిర్వచనంతో దేశాన్ని పరిమితం చేసినట్లు అవుతుందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. తాము మధ్యస్థ శక్తి కాదని, ‘మధ్యలో ఉన్న శక్తి’ అని ఆయన వ్యాఖ్యానించారు. బుధవారం ‘బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ

- మిగతా 2లో

## భారత్‌తో సంబంధాలు మళ్లీ గాడిన పడుతున్నాయి

### కెనడా విదేశాంగ మంత్రి



- నిజ్జర్ హత్య తర్వాత భారత్‌తో సంబంధాలు మెరుగుపడ్డాయన్న మంత్రి
- ఖలిస్థానీ నినాదాలపై సమతుల్యం పాటించాల్సి ఉందన్న అనితా ఆనంద్
- బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఉగ్రవాద సంస్థగా గుర్తించిన కెనడా ప్రభుత్వం
- డిసెంబర్‌లో కెనడాలో ప్రధాని మోదీ పర్యటించే అవకాశం

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### పరిమితి పాతాళంలో.. ఖర్చు ఆకాశంలో..
# పొంతన లేని ఎన్నికల ఖర్చులు

రాష్ట్రంలో స్థానిక ఎన్నికల వాతావరణం అలుముకుంది. నోటిఫికేషన్ విడుదలకు ముందు ఎన్నికల కమిషన్ ఒక్కొక్క పని చక్కబెడుతోంది. ఇప్పటికే మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్ ప్రక్రియ పూర్తి చేయగా, జడ్పీ, మండలాలు, పంచాయతీలకు ఈ రోజు సాయంత్రం కల్లా రిజర్వేషన్లు ఖరారు కానున్నాయని అంటున్నారు. ఇక ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చులపై పరిమితి విధిస్తూ ఎన్నికల సంఘం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. అయితే ఎన్నికల సంఘం విధించే పరిమితులకు వాస్తవంగా అయ్యే ఖర్చుకు ఎక్కడా పొంతన ఉండటం లేదని చెబుతున్నారు. ఎన్నికలు అంటేనే ధన బలం ఎక్కువగా చూపాల్సి వుంటుందని అంటున్నారు. ఎన్నికలలో డబ్బు దుర్వినియోగం కాకుండా, ప్రలోభాలకు అవకాశం ఇవ్వకుండా ఎన్నికల సంఘం నిఘా వేసిన అదంతా తూతూ మంత్రంగానే ఉంటుందని వ్యాఖ్యానిస్తున్నారు. స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చులపై పరిమితులు ఆసక్తి రేపుతున్నాయి. పది వేల జనాభా ఉన్న గ్రామాల్లో సర్పంచులు రూ.2.5 లక్షలు, వార్డు సభ్యులు రూ.50 వేలు ఖర్చు చేయాల్సివుంటుందని అంటున్నారు. అదే సమయంలో పది వేల కన్నా ఎక్కువ జనాభా ఉండే పంచాయతీల్లో సర్పంచులు రూ.4 లక్షలు, వార్డు సభ్యులు లక్ష చొప్పున ఖర్చు చేసుకోవచ్చునని ఎన్నికల సంఘం సూచించింది. అదే సమయంలో జడ్పీటీసీ అభ్యర్థులు రూ.8 లక్షలు, ఎంపీటీసీ అభ్యర్థులు రూ.4 లక్షలు, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థులు రూ.20 లక్షలు, కౌన్సిలర్లు రూ.7.5 లక్షలు, విశాఖ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థి 40 లక్షలు, ఇతర కార్పొరేషన్లలో మేయర్ అభ్యర్థులు 25 లక్షలు, కార్పొరేటర్లు విశాఖలో రూ20 లక్షలు, ఇతర ప్రాంతాల్లో రూ.10 లక్షల చొప్పున ఖర్చు చేయాల్సివుంటుంది. అయితే ఎన్నికల సంఘం విధించిన ఈ పరిమితి ఏమూలకూ చాలదని, నామినేషన్ వేయడానికి ముందే ఈ ఖర్చులు అయ్యే పరిస్థితి ఉందని అంటున్నారు. ఎన్నికలు అంటేనే ధన ప్రవాహం ఎక్కువగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రతి పనికి డబ్బు ఖర్చు చేయాల్సివుండటం, డబ్బు పెట్టకపోతే కనీసం ఒక్క కార్యకర్త కూడా పలికే అవకాశం లేకపోవడంతో పోటీ చేసే అభ్యర్థులు భారీగా వెచ్చించాల్సివుంటుందని అంటున్నారు. నామినేషన్ వేసేటప్పుడు జన సమీకరణ నుంచి వారికి భోజనాలు, మద్యం పంపిణీతో కలుపుకుంటే తొలిరోజే మున్సిపల్ కార్పొరేషన్లలో కోట్లలో ఖర్చు చేయాల్సివుంటుందని అంటున్నారు. కనీసం ప్రతి కార్యకర్తకు రూ.500 నుంచి ఇచ్చుకోవాల్సివుంటుందని అంటున్నారు. ఇక ఎన్నికల ముగిసే వరకు కార్యకర్తలను ప్రసన్నం చేసుకోడానికి ఓటరు దేవుడిని ఆకట్టుకోడానికి డబ్బులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉందని అంటున్నారు. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ లో రూ.40 లక్షల వరకు ఖర్చు చేయొచ్చని ఎన్నికల సంఘం పరిమితి విధించగా, ఇక్కడ దాదాపు 40 కోట్ల కంటే ఎక్కువే ఖర్చు అయ్యే అవకాశం ఉందని అంటున్నారు. అదేవిధంగా విజయవాడ, రాజమండ్రి, కాకినాడ, కడప, కర్నూలు వంటి నగరాల్లోనూ ఖర్చు కోట్లపైనే ఉంటుందని అంటున్నారు. మేయర్, చైర్మన్ అభ్యర్థులను ప్రత్యక్ష పద్దతిలో ఎన్నుకోవడం వల్ల డబ్బు మరింత ఖర్చు పెట్టాల్సివుంటోందని అంటున్నారు. గతంలో ఈ పదవులకు పరోక్ష విధానంలో ఎన్నికలు జరిగేవని, దీనివల్ల కౌన్సిలర్ అభ్యర్థులు స్థానికంగా మేనేజ్ చేసుకుని కాస్త తక్కువ ఖర్చుతో బయటపడేవారని చెబుతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఈ సారి ప్రత్యక్ష విధానంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల మేయర్, చైర్మన్ పదవులకు ప్రతిష్ఠ పెరిగిందని, ఐదేళ్లు పదవిలో ఉండే అవకాశం ఉండటం వల్ల అభ్యర్థులు కూడా తమ వ్యక్తిగత పరువు ప్రతిష్టల కోసం ఎక్కువ ఖర్చు పెట్టే అవకాశం ఉందని అంటున్నారు.

### బెజవాడ దుర్గమ్మను దర్శించుకున్న
## రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

- మొదటి పేజి తరువాయి

అమ్మవారిని దర్శించుకున్న అనంతరం, వేద పండితులు రాష్ట్రపతికి వేదాశీర్వచనాలు అందించారు. ఆలయ అధికారులు ఆమెకు పట్టువస్త్రాలు, అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులను రాష్ట్రపతి ఆప్యాయంగా పలకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ ఆమె ముందుకు సాగారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

# జనసేనలో చేరిన వంగవీటి రాధా..

- మొదటి పేజి తరువాయిది

ఈ పరిణామంతో విజయవాడ మేయర్ అభ్యర్థిగా రాధాకృష్ణ పేరు తెరపైకి వచ్చింది. విజయవాడ మేయర్ పదవికి రాధాకృష్ణ పోటీ చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే, మేయర్ సీటును కూటమిలో జనసేనకు కేటాయిస్తారా? అన్నది ఇంకా స్పష్టం కాలేదు. గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి రాధాకృష్ణ కృషి చేశారు. వైసీపీ నుంచి బయటకు వచ్చిన తర్వాత టీడీపీతో కలిసి పనిచేస్తూ వచ్చారు. ఇప్పుడు జనసేనలో చేరడంతో ఆయన రాజకీయ భవిష్యత్తుపై ఆసక్తి నెలకొంది. మరోవైపు, స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా ప్రకటించారు. మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, జడ్పీ ఛైర్మన్ల పదవులకు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ ప్రభుత్వం ఇప్పటికే గెజిట్‌లు విడుదల చేసింది. ఈ తరుణంలో రాధా చేరికకు ప్రాధాన్యం ఏర్పడింది. స్థానిక ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై కూటమి నేతలు చర్చలు జరుపుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో జనసేన నేతలు నాదెండ్ల మనోహర్, లింగమనేని రమేశ్, హరిప్రసాద్ సమావేశమయ్యారు. విజయవాడలోని 86 డివిజన్లలో 35 స్థానాలు తమకు కేటాయించాలని జనసేన కోరుతున్నట్లు సమాచారం. అయితే, 15 స్థానాలు ఇచ్చేందుకు టీడీపీ సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. సీట్ల పంపకాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

# ప్రజాబలంపై కాదు..
## పోలీసు బలంపై ఆధారపడ్డారు

ఆంధ్రప్రదేశ్‌లో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజాబలంపై కాకుండా పోలీసుల శక్తిపై ఆధారపడిందని వైసీపీ ఆరోపించింది. వైసీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకునేందుకు అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆ పార్టీ నేతలు ఆరోపించారు. తాడేపల్లిలో మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి కురసాల కన్నబాబు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ప్రజాబలం లేకే చంద్రబాబు ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని ఎన్నికల్లో గెలవాలని చూస్తోంది. వైసీపీ తరఫున పోటీ చేయాలనుకుంటున్న వారిని బెదిరిస్తున్నారు. పాత కేసులు తిరగదోడి, బైండోవర్ల పేరుతో ఉదయం నుంచి రాత్రి వరకు పోలీస్ స్టేషన్లలో కూర్చోబెట్టి వేధిస్తున్నారు. కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంలో కావాలనే జాప్యం చేస్తున్నారు" అని ఆరోపించారు. క్వాంటం కంప్యూటింగ్ గురించి మాట్లాడే ప్రభుత్వం, క్యాస్ట్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ఒక యాప్‌ను సరిగా నడపలేకపోతోందా అని ఆయన ప్రశ్నించారు. 24 గంటల్లో మాన్యువల్‌గా సర్టిఫికెట్లు అందించాలని డిమాండ్ చేశారు.

పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను పూర్తిగా వెబ్‌కాస్టింగ్ చేయాలని, సున్నితమైన ప్రాంతాల్లో కేంద్ర బలగాలను మోహరించాలని కన్నబాబు డిమాండ్ చేశారు. వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల కేటాయింపులోనూ అవకతవకలు జరిగాయని, ఇవి ప్రజల సౌలభ్యం కోసం కాకుండా అధికార పార్టీకి అనుకూలంగా జరిగాయని ఆరోపించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా, జగన్ నాయకత్వంలో ప్రతి వార్డులోనూ పోటీ చేసి గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# విజయనగరం జడ్పీ రేసులో బొత్స సత్యనారాయణ కూతురు అనూష?

- మొదటి పేజి తరువాయి

సీనియర్ నేత బొత్స సత్యనారాయణ తన కుమార్తె బొత్స అనూషను రంగంలోకి దించాలని యోచిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. విజయనగరం జెడ్పీ ఛైర్‌పర్సన్ పదవిని ఈసారి బీసీ (మహిళ)కు రిజర్వ్ చేశారు. ఇదే ఇప్పుడు రాజకీయ సమీకరణాలకు కేంద్ర బిందువుగా మారింది. గతంలో వైసీపీ తరఫున జెడ్పీ ఛైర్మన్‌గా ఉన్న చిన్న శ్రీను, ఇప్పుడు టీడీపీ కూటమి తరఫున తన కుమార్తె సిరి సహస్రను బరిలోకి దించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో చిన్న శ్రీను దూకుడుకు కళ్లెం వేయాలంటే, బొత్స కుటుంబం నుంచే బలమైన అభ్యర్థిని నిలబెట్టాలని వైసీపీ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా వృత్తిరీత్యా డాక్టర్ అయిన బొత్స అనూషను ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం బొత్స అనూష భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా

బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఒకవేళ పార్టీ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇస్తే, ఆమె విజయనగరం జెడ్పీ ఛైర్‌పర్సన్ బరిలో నిలవడం ఖాయమని చెబుతున్నారు. ఇదే జరిగితే విజయనగరం జెడ్పీ ఎన్నికల పోరు, బొత్స కుటుంబ సభ్యుల మధ్య ప్రత్యక్ష పోరుగా మారి రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తించడం ఖాయం.

# ఢిల్లీలో అక్టోబర్ 16న 'తిరంగా' నిరసన..

- మొదటి పేజి తరువాయి

ప్రదర్శన నిర్వహించనున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రకటించారు. దేశభక్తులంతా జాతీయ జెండాలతో సెంట్రల్ పార్క్‌కు రావాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో విడుదల చేసిన వీడియో సందేశంలో ఈ నిరసనకు 'లెహ్రావో దో తిరంగా' అని పేరు పెట్టినట్లు దీప్కే తెలిపారు. కేవలం త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించినందుకే సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను జైలుకు పంపారని ఆయన ఆరోపించారు. అక్టోబర్ 16న సాయంత్రం 5 గంటలకు కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌కు జాతీయ జెండాలతో చేరుకోవాలని కోరారు. త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం నేరం కాదని ఈ కార్యక్రమం ద్వారా చాటిచెబుతామని అన్నారు. ఢిల్లీకి రాలేని వారు తమ ప్రాంతాల్లో తిరంగా మార్చ్‌లు నిర్వహించాలని దీప్కే విజ్ఞప్తి చేశారు. జాతీయ జెండా తమ గర్వకారణమని, దాన్ని ప్రదర్శించడం నేరం కాదనే సందేశాన్ని అందించాలని కోరారు. ఈ నిరసన తర్వాత తనను కూడా అరెస్టు చేసే అవకాశం ఉందని, అయినా ఆందోళన చెందడం లేదని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శిస్తానని స్పష్టం చేశారు.

**ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ**

మరోవైపు, జంతర్ మంతర్‌లోకి అక్రమంగా ప్రవేశించిన కేసులో సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలకు బుధవారం ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు. సీజేపీకి చెందిన మరో నేత అజింక్య షిండే వ్యక్తిగత పూచీకత్తుపై విడుదలయ్యారు. దాస్‌ను తీహార్ జైలులోని రెండో నంబర్ జైలులో, రంకాను నాలుగో నంబర్ జైలులో వేర్వేరుగా ఉంచినట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వర్గాలు తెలిపాయి. ముగ్గురు సీజేపీ సభ్యులను జంతర్ మంతర్‌లోకి చొరబడినందుకు ముందస్తు నిర్బంధంలోకి తీసుకున్నారు. జంతర్ మంతర్‌ను నిరసనలకు కేటాయించిన అధికారిక ప్రదేశాల జాబితా నుంచి తొలగించిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

# జర్మనీలో ఘోర అగ్నిప్రమాదం..
## ముగ్గురు భారతీయుల సజీవ దహనం

- మొదటి పేజి తరువాయి

ఓ నివాస భవనంలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటనలో మరో ఐదుగురు గాయపడ్డారు. ఈ సంఘటనపై హత్య అనుమానంతో పోలీసులు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. బోచుమ్‌లోని హోఫ్‌స్టెడ్ జిల్లాలో ఉన్న ఓ నివాస భవనంలో మంగళవారం తెల్లవారుజామున మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం భవనంలోని రెండో అంతస్తులో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో ముగ్గురి మృతదేహాలను గుర్తించారు. మృతులను 25, 27 ఏళ్ల వయసున్న ఇద్దరు యువతులుగా, 26 ఏళ్ల యువకుడిగా గుర్తించారు. వీరంతా భారతీయులని అధికారులు నిర్ధారించారు. ఈ ప్రమాదంలో పొగ పీల్చడం వల్ల తీవ్ర అస్వస్థతకు గురైన మరో ఐదుగురిని చికిత్స కోసం స్థానిక ఆసుపత్రులకు తరలించారు. ప్రస్తుతం వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అయితే గాయపడిన వారి జాతీయతకు సంబంధించిన వివరాలు తెలియరాలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రాథమిక విచారణ అనంతరం అదే భవనంలో నివసించే 41 ఏళ్ల రొమేనియా దేశస్థుడిని హత్య అనుమానంతో అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ అగ్నిప్రమాదం ప్రమాదవశాత్తు జరిగిందా లేక ఎవరైనా ఉద్దేశపూర్వకంగా చేశారా అనే కోణంలో విచారణ కొనసాగుతోంది.

### జగన్ అక్రమాస్తుల కేసులపై కీలక పరిణామం..
# ఇక రోజువారీ విచారణ

- మొదటి పేజి తరువాయి

(ఈడీ) కేసులను కూడా రోజువారీగా విచారించాలని సీబీఐ కోర్టు నిర్ణయించింది. ఈ నిర్ణయంతో పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ వేగవంతం కానుంది. ఈ కేసుల్లో జగన్‌తో పాటు మరో 70 మంది నిందితులను వ్యక్తిగతంగా విచారించాలని న్యాయస్థానం నిర్ణయం తీసుకుంది. జగన్‌పై దాదాపు దశాబ్దకాలంగా 9 ఈడీ ఛార్జిషీట్లు న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్నాయి. వీటిపై విచారణను వేగవంతం చేయాలని కోరుతూ ఈడీ అధికారులు ఇప్పటికే తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. సీబీఐ కోర్టులో నిందితులు దాఖలు చేసుకున్న డిశ్చార్జ్ పిటిషన్లపై తీర్పులు రాకపోవడంతో కేసుల విచారణ ముందుకు సాగడం లేదని ఈడీ తన పిటిషన్‌లో పేర్కొంది. ఈడీతో పాటు మాజీ మంత్రి హరిరామజోగయ్య, మరికొందరు కూడా విచారణను వేగవంతం చేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో సీబీఐ కోర్టు తీసుకున్న తాజా నిర్ణయంతో జగన్‌పై ఉన్న కేసుల విచారణ ఇకపై వేగంగా ముందుకు సాగే అవకాశం కనిపిస్తోంది.

# భారత్‌తో సంబంధాలు మళ్లీ గాడిన పడుతున్నాయి

ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య తర్వాత తీవ్రంగా దెబ్బతిన్న భారత్-కెనడా ద్వైపాక్షిక సంబంధాలు ఇప్పుడు మళ్లీ గాడిన పడుతున్నాయని, క్రమంగా బలపడుతున్నాయని కెనడా విదేశాంగ మంత్రి అనితా ఆనంద్ అన్నారు. ఓ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ, ఇరు దేశాల మధ్య సంబంధాలలో చోటుచేసుకుంటున్న ఈ మార్పును ఆమె ఒక "ఆహ్వానించదగ్గ పరిణామం"గా అభివర్ణించారు.

వాణిజ్యం, పర్యాటకం, విద్య వంటి రంగాల్లో ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలు చాలా లోతుగా, బలంగా ఉన్నాయని ఆనంద్ తెలిపారు. రాబోయే దశాబ్దంలో అమెరికాయేతర దేశాలతో వాణిజ్యాన్ని రెట్టింపు చేసుకోవాలని కెనడా లక్ష్యంగా పెట్టుకుందని, ఈ నేపథ్యంలో 4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, ప్రపంచంలో ఆరవ అతిపెద్ద శక్తిగా ఉన్న భారత్ తమకు ఎంతో ముఖ్యమని ఆమె నొక్కిచెప్పారు. నిజ్జర్ హత్య ఉదంతంపై మాట్లాడుతూ.. కెనడా గడ్డపై ఒక కెనడా పౌరుడి హత్యకు సంబంధించిన కేసులో న్యాయపరమైన విచారణ కొనసాగుతోందని ఆమె స్పష్టం చేశారు. చట్టబద్ధ పాలన, దేశీయ భద్రతకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. భారత ప్రభుత్వంతో చర్చల్లో గణనీయమైన పురోగతి సాధించామని, ఇందులో భాగంగానే 'బిష్ణోయ్ గ్యాంగ్'ను ఉగ్రవాద సంస్థగా గుర్తించామని వెల్లడించారు. కెనడాలో నిరసనల సందర్భంగా ఖలిస్థాన్ అనుకూల నినాదాలు, ఇందిరా గాంధీ హత్యను ప్రస్తావించడం వంటి ఘటనలపై అడిగిన ప్రశ్నకు.. కెనడాలో భావప్రకటనా స్వేచ్ఛకు, ప్రజా భద్రతకు మధ్య సమతుల్యం పాటించాల్సిన అవసరం ఉందని బదులిచ్చారు. ఈ అంశాన్ని దేశ ప్రజా భద్రత, న్యాయశాఖ మంత్రులు పర్యవేక్షిస్తున్నారని, తన దృష్టి అంతా విదేశీ సంబంధాలపైనే ఉందని ఆమె వివరించారు.

కెనడా ప్రధాని మార్క్ కార్నీ, భారత ప్రధాని నరేంద్ర మోదీతో తన సంబంధానికి ఎంతో విలువ ఇస్తారని అనితా ఆనంద్ చెప్పారు. ఈ ఏడాది డిసెంబర్‌లో కెనడా పర్యటనకు రానున్న ప్రధాని మోదీకి స్వాగతం పలికేందుకు తాము ఎదురుచూస్తున్నామని ఆమె వెల్లడించారు. ఇప్పటికే ఇరు దేశాల రాయబార కార్యాలయాలను బలోపేతం చేశామని, ఇరు దేశాల నేతలు క్రమం తప్పకుండా సమావేశమవుతూ సంబంధాలను మెరుగుపరుస్తున్నారని గుర్తుచేశారు.

## పాక్ సహా 31 దేశాల పైలట్లపై 'ఎయిర్ ఫ్రాన్స్' నిషేధం

ఇజ్రాయెల్‌కు వెళ్లే తమ విమానాల్లో పనిచేసే సిబ్బంది విషయంలో ప్రభుత్వం విధించిన కొత్త నిబంధనలను పాటించనున్నట్లు ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఫ్రాన్స్ ధృవీకరించింది. ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలు లేని పాకిస్థాన్ సహా 31 దేశాలకు చెందిన పైలట్లు, క్యాబిన్ సిబ్బందిని తమ దేశంలోకి అనుమతించబోమని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది. ఈ మేరకు ఎయిర్ ఫ్రాన్స్ తన సిబ్బందికి సమాచారం అందించింది.

ఇటీవల ఫ్లైదుబాయ్ విమానంలో చోటుచేసుకున్న భద్రతా సంఘటనే ఈ కఠిన నిబంధనలకు దారితీసింది. సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానాన్ని ఒమన్‌కు చెందిన సహ పైలట్ హైజాక్ చేసేందుకు యత్నించిన విషయం తెలిసిందే. బెన్ గురియన్ విమానాశ్రయాన్ని ఢీకొట్టేందుకు ప్లాన్ చేశాడని, ఈ క్రమంలో భారత కెప్టెన్‌పై దాడి చేశాడని తెలిసింది. ఈ ఘటన జరిగిన మరుసటి రోజే ఇజ్రాయెల్ రవాణా మంత్రిత్వ శాఖ విదేశీ విమానయాన సంస్థలకు ఓ ఆదేశం జారీ చేసింది. పాకిస్థాన్, ఇరాన్, సౌదీ అరేబియా, అల్జీరియా, ట్యూనీషియా, ఒమన్ వంటి 31 ముస్లిం మెజారిటీ దేశాల జాతీయత లేదా ద్వంద్వ పౌరసత్వం ఉన్న సిబ్బందిని ఇజ్రాయెల్‌కు వచ్చే విమానాల్లో నియమించవద్దని స్పష్టం చేసింది. ఈ నిబంధనలను పాటించకపోతే సంస్థతో పాటు ఉద్యోగులు కూడా చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎయిర్ ఫ్రాన్స్ తన అంతర్గత మెమోలో పేర్కొన్నట్లు సమాచారం. అయితే, ఎయిర్ ఫ్రాన్స్ నిర్ణయం ఫ్రాన్స్‌లో న్యాయపరమైన చిక్కులకు దారితీసే అవకాశం ఉంది. జాతీయత లేదా మతం ఆధారంగా వివక్ష చూపడాన్ని ఫ్రెంచ్ ఉపాధి చట్టాలు నిషేధిస్తున్నాయి. ఇది ఆ దేశ చట్టాలకు విరుద్ధమని న్యాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు దేశ భద్రత దృష్ట్యా తన గగనతలాన్ని నియంత్రించుకునే హక్కు ఇజ్రాయెల్‌కు ఉన్నప్పటికీ, ఈ నిబంధనలను అమలు చేయడం వల్ల విమానయాన సంస్థలు తమ సొంత దేశాల్లో న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. ఈ నిబంధనల వల్ల విమానయాన సంస్థల సిబ్బంది షెడ్యూలింగ్‌పై ఎలాంటి ప్రభావం పడుతుందనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు.

## భారత్ ఎదుగుదలను మేమే పరిమితం చేసుకోలేం

- మొదటి పేజి తరువాయి

ఫోరమ్'లో జరిగిన ఒక చర్చా కార్యక్రమంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌ను మధ్యస్థ శక్తిగా ఎందుకు అభివర్ణించకూడదు అని అడిగిన ప్రశ్నకు జైశంకర్ బదులిస్తూ, "ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా, సుమారు నాలుగు ట్రిలియన్ డాలర్ల జీడీపీతో, భవిష్యత్తులో అపారమైన అభివృద్ధి అవకాశాలు ఉన్న దేశానికి 'మధ్యస్థాయి శక్తి' అనే వర్ణన సౌకర్యంగా ఉండదు. ఆ నిర్వచనంతో మనల్ని మనమే పరిమితం చేసుకున్నట్టు అవుతుంది" అని వివరించారు. ఇతరులకు సాధికారత కల్పించే దేశాలనే మధ్యస్థ శక్తులుగా ప్రధాని మోదీ అభివర్ణించారని, కానీ భారత్ విషయంలో ఈ నిర్వచనం సరిపోదని ఆయన తెలిపారు. ప్రస్తుత ప్రపంచం కేవలం మధ్యస్థాయి శక్తులతోనే కాకుండా ఇతర దేశాలపై ఒత్తిడి తెచ్చే సాధనాలతో నిండి ఉందని జైశంకర్ విశ్లేషించారు. "ఆర్థిక ఆంక్షలు, ఫైనాన్స్ వంటి అంశాలను కూడా ఇప్పుడు అస్త్రాలుగా వాడుకుంటున్నారు. ఇది ప్రపంచాన్ని మరింత సంక్లిష్టంగా మారుస్తోంది" అని ఆయన అన్నారు. భవిష్యత్తులో పోటీ స్వరూపం మారనుందని జైశంకర్ అభిప్రాయపడ్డారు. ప్రతి దేశం తమ బలాలు, వనరులతో చర్చలకు వస్తుందని, పరస్పర అవసరాల ఆధారంగా ఒప్పందాలు ఉంటాయని అన్నారు. "చర్చల్లో ఎవరు ఎక్కడ కూర్చుంటారు, ఎవరు గట్టిగా మాట్లాడతారు అనే విషయాలు మారుతాయి. ఈ మార్పుల గురించి నిరాశావాద దృక్పథం అవసరం లేదు" అని ఆయన భవిష్యత్ ప్రపంచ తీరును అంచనా వేశారు.

# ప్రత్తిపాడు మండలం ఎంపీటీసీ స్థానాలు రిజర్వేషన్ల ఖరారు.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, అక్టోబర్, 14:**ప్రత్తిపాడు మండల పరిధిలోని ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్ల జాబితా వెల్లడైంది. మండలంలోని 23 ఎంపిటిసి స్థానాల్లో కేటాయించిన రిజర్వేషన్ల వివరాలు ఇలా ఉన్నాయి. గోకవరం / పాండవులపాలెం / బురదకోట-జనరల్ (మహిళ),శరభవరం / బౌరువాక: ఎస్టీ, యు. జగన్నాథపురం / వెంకటనగరం-జనరల్ (మహిళ),పెద్దపాలెం-జనరల్,ప్రత్తిపాడు 1- ఎస్సీ (మహిళ),ప్రత్తిపాడు 2, 3 - జనరల్, లంపకలోవ-ఎస్సీ,ఉత్తరకంచి / రౌతుపాలెం- జనరల్ (మహిళ),రాచపల్లి 1- బీసీ, రాచపల్లి 2- బీసీ (మహిళ),గజ్జనపూడి - జనరల్ (మహిళ),ధర్మవరం 1, 3 -జనరల్, ధర్మవరం 2- జనరల్ (మహిళ),వొమ్మింగి 1-జనరల్ (మహిళ),ఒమ్మింగి 2 - జనరల్, చినశంకర్లపూడి - బీసీ (మహిళ), ఏలూరు 1- ఎస్సీ, ఏలూరు/ టి.రాయవరం - ఎస్సీ (మహిళ), చింతలూరు / పెదశంకర్లపూడి - బీసీ, పోతులూరు /వాకాపల్లి: బీసీ (మహిళ) ఈ రిజర్వేషన్ల ప్రకటనతో స్థానిక రాజకీయ వర్గాల్లో ఎన్నికల సందడి నెలకొంది. ఆయా స్థానాలపై ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.


పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా




వివరాలు 4లో..

## వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 14:**మండల పరిధి వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులకు కూటమి నాయకులు బుధవారం శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు ఈదల సత్తిబాబు, సలాది నాగేశ్వరరావు, టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ మాజీ సర్పంచ్ నాగిరెడ్డి వెంకటరత్నం, ఏఎంసీ చైర్మన్ కొత్తపల్లి వెంకటలక్ష్మి, మాజీ ఉప సర్పంచ్ తాడి శ్రీనివాస్ రెడ్డి లు మాట్లాడుతూ... విబి గ్రామ్ జి నిధులు రూ.27 లక్షలతో మడికి లో రెండు చోట్ల సిసి రోడ్ల నిర్మాణానికి, బడుగువానిలంకలో పుష్కర నిధులు రూ.50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి, జొన్నాడ లో రూ.1.20 కోట్లతో మెటల్ రోడ్డు, పుష్కర నిధులు రూ.65 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన కార్యక్రమం చేపట్టి పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. దీర్ఘకాలికంగా వివిధ కారణాలతో అభివృద్ధికి నోసుకోకుండా మిగిలిపోయిన వాటిని పరిష్కరించి గ్రామాల్లో సిసి రోడ్లను, గ్రామాల మధ్య బిటి రోడ్లను, రైతులకు అణువుగా పుంత మార్గాల్లో మెటల్ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పెద్దపీట వేస్తు అడిగిందే తడవుగా నిధులు మంజూరు చేయిస్తూ ఎంతో సహకరిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు దొండపాటి సుబ్బరాజు, చెల్లబోయిన శ్రీనివాస్, పంపన అంజిబాబు, కొత్తపల్లి నగేష్, కొత్తపల్లి కృష్ణ, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కనకదుర్గ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలి.

-ధర్మవరంలో అన్నదానానికి 20 వేల రూపాయలు విరాళం అందజేసిన మురళీ కృష్ణంరాజు.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, అక్టోబర్, 14:** శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు, ప్రత్తిపాడు నియోజకవర్గం వైసిపి నాయకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు.ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో విజయదశమి సందర్భంగా దేవీ నవరాత్రుల మహోత్సవాలను పురస్కరించుకుని శ్రీ కనకదుర్గమ్మ వారి అన్నదాన కార్యక్రమానికి 20,000 రూపాయలు విరాళం కమిటీ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నానిపల్లి చంటి,మాజీ వైస్ సర్పంచ్ జువ్వల సత్యనారాయణ,బొల్లు నాగేశ్వరరావు,జువ్వల దొరబాబు,మాజీ వార్డ్ నెంబర్ కోన సత్తిబాబు,కోన బాబ్జి,పెండ్యాల అబ్బు,గొనగాని వీరబాబు ,కోన ప్రకాష్ ,గొనగాని లోవరాజు, గదుల ప్రసాద్,రాముడి కృష్ణయ్య ,స్వయంవరపు తాతాజీ, భవాని భక్తులు,ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు



# రూ.1.10 కోట్లతో కాజులూరులో పుష్కరాల సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన





- రెండున్నరేళ్లలో రామచంద్రపురం నియోజకవర్గంలో రూ.250 కోట్లతో అభివృద్ధి పనులు
- మంత్రి వాసంశెట్టి సుభాష్

**కాజులూరు, పెన్ పవర్,అక్టోబర్ 14** :రామచంద్రపురం నియోజకవర్గంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. గత రెండున్నరేళ్లలో నియోజకవర్గవ్యాప్తంగా సుమారు రూ.250 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు.కాజులూరు గ్రామంలో పుష్కరాల అభివృద్ధి నిధులతో రూ.1.10 కోట్ల వ్యయంతో ఏజీకే పేట నుంచి ఆత్రేయ పుష్కర ఘాట్ వరకు నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం మంత్రి వాసంశెట్టి సుభాష్ సంబంధిత అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డీఈ సత్య శ్రీనివాస్, కాజులూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చవ్వాకుల నారాయణమూర్తి (డాక్టర్ బాబు) పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పుష్కర ఘాట్‌కు వెళ్లే భక్తులతో పాటు స్థానిక ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో రహదారి నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పుష్కరాల అభివృద్ధి నిధులతో పాటు పల్లె పండుగ 3.0 నిధుల ద్వారా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

### గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత

గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు మెరుగుపడితే ప్రజల రాకపోకలకు సౌకర్యం కలగడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మంత్రి అన్నారు. చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

### రామచంద్రపురం పట్టణానికి రూ.70 కోట్లకు పైగా నిధులు

రామచంద్రపురం నియోజకవర్గంలో గత రెండున్నరేళ్లలో సుమారు రూ.250 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని మంత్రి వివరించారు. రామచంద్రపురం పట్టణ అభివృద్ధికి రూ.70 కోట్లకు పైగా నిధులు తీసుకువచ్చి పలు కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.

### అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని మంత్రి కూటమి నాయకులకు సూచించారు. కూటమి పార్టీల నాయకులు సమన్వయంతో, ఐక్యతతో పనిచేస్తూ ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జె. రాంబాబు,డీఈ సత్య శ్రీనివాస్, ఏఈ భవానీ శంకర్,చవ్వాకుల నారాయణ మూర్తి (డాక్టర్ బాబు) చుండ్రు వీర్రాజు చౌదరి,కోట తాతబ్బాయి,తాడి రామారెడ్డి, యాళ్ల రవి, పేపకాయల బాబ్జి, వనుం వీరబ్రహ్మం, దడాల నాగార్జున, మేడిశెట్టి వీర వెంకట సత్యనారాయణ,జల్లి సత్యనారాయణ, రంపాల రాజు, చందాల ఆదినారాయణ, కూటమి పార్టీల నాయకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శంఖవరంలో ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన టిప్పర్....



- తృటిలో ప్రాణాపాయం నుండి ముగ్గురు బయటపడిన వైనం....
- టిప్పర్ల రాకపోకలను అడ్డుకున్న గ్రామస్తులు, పోలీసులతో వాగ్వాదం....



**శంఖవరం పెన్ పవర్ అక్టోబర్ 14:-** మండల కేంద్రం శంఖవరంలో టిప్పర్ల రాకపోకలతో రోజుకొక ప్రమాదం చోటుచేసుకోవడం, ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం కలగడం పరిపాటిగా మారిపోయింది. మధ్యవీధిలో గల బొర్రా వీర వెంకట సత్యనారాయణ (సత్తిబాబు) అనే వ్యక్తి తన ఇద్దరు మనువడులతో ఆక్టివా ద్విచక్ర వాహనంపై బజారుకు బయలుదేరాడు. వెనుకనే
మితిమీరిన వేగంతో వస్తున్న టిప్పర్ ను గుర్తించి, రోడ్డుకు పూర్తిగా ఎడమ వైపుకు వచ్చినప్పటికీ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బొర్రా సత్తిబాబుతో పాటు తన ఇద్దరు మనువడులు తూలి ప్రక్కనే గల డ్రైనేజీ పెంటపై పడిపోయారు. ద్విచక్ర వాహనం మాత్రం లారీ ముందు చక్రం క్రిందకు పోవడంతో ధ్వంసమైంది. దీనితో బాధితుడు బొర్రా సత్తిబాబు తోపాటు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేసి టిప్పర్ల రాకపోకలను అడ్డుకున్నారు. దీనితో సమాచారం అందుకున్న అన్నవరం ఎస్సై శ్రీహరిబాబు ఘటన ప్రాంతానికి చేరుకుని పిర్యాదు చేస్తే టిప్పర్ డ్రైవర్ పై చర్యలు తీసుకుంటామని, ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా చూడాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామస్తులు తాము రోడ్లపై నడవాలన్నా... ప్రయాణించాలన్నా.... ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రావాల్సి వస్తుందని తమ ఆగ్రహం వెలిబుచ్చారు. అనంతరం కొంత సమయం గ్రామస్తులు, పోలీసులకు వాగ్వాదం చోటుచేసుకున్న అనంతరం ట్రాఫిక్ ను వదిలారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ ను శంఖవరంలో పాత ఆసుపత్రి ఆవరణలో ఉంచారు. అనంతరం బాధితుడి నుండి ఎస్సై శ్రీహరిబాబు పిర్యాదు స్వీకరించారు.

## పల్లె పండుగ 3.0లో రూ.15 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన





**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 14:**పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సహకారంతో మెర్లపాలెం గ్రామంలోని మాదిగ పేటలో రూ.15 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడం, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడం లక్ష్యంగా ఈ పనులు చేపట్టనున్నారు. పనులు పూర్తయితే స్థానికులకు రాకపోకల సౌకర్యం మెరుగుపడటంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణకు దోహదపడనున్నాయి.

ఈ కార్యక్రమంలో వాటర్ డిస్ట్రిబ్యూటరీ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు, ఎం.ఆర్.పి.ఎస్. జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు కొమ్మర రాఘవ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు మల్లవరపు నాగరాజు, జనసేన గ్రామ అధ్యక్షుడు వినయ్, పంచాయతీ కార్యదర్శి వల్లూరు సురేష్, వీఆర్వో వాసుతో పాటు పలువురు నాయకులు, గ్రామస్తులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టడంపై స్థానిక నాయకులు సంతోషం వ్యక్తం చేశారు.ం

## ఆత్రేయపురం పీహెచ్‌సీ ల్యాబ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా మలేరియా అధికారి

రక్త పరీక్షలు, రికార్డుల పరిశీలన.. ల్యాబ్ సిబ్బందికి పలు సూచనలు



**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 14:**కోనసీమ జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కే. నాగ శ్రీనివాసు బుధవారం ఆత్రేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రక్త పరీక్షల ప్రయోగశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ల్యాబ్‌లో నిర్వహిస్తున్న మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులకు సంబంధించిన రక్త పరీక్షల ప్రక్రియను పరిశీలించారు. అలాగే ల్యాబ్‌లోని రికార్డులను తనిఖీ చేసి, పరీక్షల నిర్వహణకు సంబంధించిన వివరాలను వెరిఫై చేశారు.ఈ సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్‌కు పలు సూచనలు, సలహాలు అందించారు. రక్త పరీక్షలను నిబంధనల ప్రకారం నిర్వహించాలని, రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ పరీక్షల విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.ఈ తనిఖీలో డాక్టర్ పి. సౌమ్య, డాక్టర్ హైమ శ్రీ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అరుణకుమారి, వైద్య సహాయకులు ఎం.టి.వి.ఎన్. మూర్తి, ల్యాబ్ టెక్నీషియన్ జాన్సన్‌తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదిత్య యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ "శ్రీనివాస్ మట్టపర్తి " కి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ



**గండేపల్లి, పెన్ పవర్, అక్టోబర్ ,14:**గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ లో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం నందు అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న"శ్రీనివాస్ మట్టపర్తి" ఎన్.ఐ.టి. సిల్చార్ ,అస్సాం నుంచి డాక్టరేట్ సాధించినట్లు ఆదిత్య యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ " ఎన్.ఐ.టి. సిల్చార్ ,అస్సాం కి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్. డా. హిమాంశు కరణ్ మరియు అసోసియేట్ ప్రొఫెసర్. డా.ఎస్.కె.త్రిపాఠి నేతృత్వంలో శ్రీనివాస్ మట్టపర్తి సమర్పించిన "థీసిస్ శీర్షిక: "మెరుగైన పనితీరును సాధించడానికి పెరోవ్‌స్కైట్-ఆధారిత సౌర ఘటాలపై పరిశోధన " అనే అంశంపై డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు. "డా .శ్రీనివాస్ మట్టపర్తి " భవిష్యత్ లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆదిత్య అధినేత, యూనివర్సిటీ ఛాన్సలర్ డా. ఎన్. శేషారెడ్డి, శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ . డా.ఎం.శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్. ప్రో. ఎం.బి. శ్రీనివాస్. ప్రో. వైస్ ఛాన్సలర్. డా. ఎస్. రమాశ్రీ, డా. ఆదిరెడ్డి రమేష్, డా. రవి తంగజన్, రిజిస్ట్రార్ డా జి.సురేష్, విభాగాధిపతి డా.సి.హెచ్.జానకీదేవి మరియు వివిధ విభాగాల విభాగాధిపతులు ఉపాధ్యాయ సిబ్బంది "డా.శ్రీనివాస్ మట్టపర్తి " కి అభినందనలు తెలియజేశారు.

# ప్రజా బలమే అసలైన బలం..

- పెత్తందారులకు ప్రత్యక్ష ఎన్నికలే పరీక్ష!
- ఏపీ మున్సిపల్ ఎన్నికలు.. షాడో ఎమ్మెల్యేల హవాకు ప్రజాతీర్పుతో చెక్ పడేనా?
- పార్టీ అధికారాన్ని అడ్డుపెట్టుకుని పెత్తనం చెలాయించడం ఒక ఎత్తు.. ప్రజల ముందుకు వెళ్లి ఓట్లు సాధించడం మరో ఎత్తు! ఇన్నాళ్లూ తెరవెనుక రాజకీయాలు నడిపిన నాయకులకు ప్రత్యక్ష మేయర్, మున్సిపల్ చైర్మన్ ఎన్నికలు అసలైన అగ్నిపరీక్షగా మారనున్నాయి.

**పెన్ పవర్ ప్రత్యేక రాజకీయ విశ్లేషణ । కాకినాడ బ్యూరో । అక్టోబర్ 14 :**రాజకీయాల్లో అధికార బలం వేరు.. ప్రజాబలం వేరు! పార్టీ అధికారంలో ఉందన్న ధీమాతో కొందరు నాయకులు తమ స్థాయికి మించి పెత్తనం చెలాయిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యేల అండతో నియోజకవర్గ రాజకీయాలను శాసిస్తూ, దిగువ స్థాయి నాయకులు, కార్యకర్తలను తమ చెప్పుచేతల్లో ఉంచుకునే ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరికొందరు తెరవెనుక చక్రం తిప్పుతూ షాడో ఎమ్మెల్యేలుగా వ్యవహరిస్తున్నారన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.

పది కీలక రాజకీయ పరిణామాలు

1. పార్టీ అండతో పెత్తనం: అధినాయకత్వం ఆశీస్సులతో స్థానిక రాజకీయాలను శాసిస్తున్న కొందరు నేతలకు ప్రత్యక్ష ఎన్నికలు సవాలుగా మారనున్నాయి.
2. షాడో ఎమ్మెల్యేలకు పరీక్ష: తెరవెనుక రాజకీయాలు నడిపిన నాయకులు నేరుగా ప్రజల ముందుకు వస్తే వారి అసలు బలం బయటపడనుంది.
3. ప్రత్యక్ష ఎన్నికలతో కొత్త సమీకరణాలు: మేయర్, మున్సిపల్ చైర్మన్ పదవులకు ప్రత్యక్ష ఎన్నికల విధానంతో వ్యక్తిగత ప్రజాదరణ ప్రాధాన్యం సంతరించుకోనుంది.
4. కార్యకర్తల అసంతృప్తి: ఇన్నాళ్లూ అవమానాలను భరించిన కార్యకర్తలు ఎన్నికల్లో ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.
5. పార్టీ బలం ఒక్కటే సరిపోదు: అధిష్ఠానం మద్దతుతో టికెట్ సాధించినా ప్రజల విశ్వాసం లేకుంటే గెలుపు కష్టమే.
6. పైరవీలకు కాలం చెల్లుతుందా?: రాజకీయ పరిచయాలతో పదవులు ఆశించే నేతలకు ప్రజాక్షేత్రంలో సత్తా నిరూపించుకోవడం తప్పనిసరి.
7. పెత్తనమా.. ప్రజాభిమానమా?: అధికారంతో భయపెట్టగలిగినా ఓటర్ల మనసులు గెలుచుకోవడం అంత సులభం కాదు.
8. చైర్మన్ పీఠంపై ఆశలు: ఇన్నాళ్లూ పరోక్ష మార్గంలో పదవులు ఆశించినవారు ఇప్పుడు పట్టణవ్యాప్తంగా ప్రజల మద్దతు కూడగట్టాల్సి ఉంటుంది.
9. పార్టీలకు అభ్యర్థుల ఎంపిక సవాల్: రాజకీయ పలుకుబడికంటే ప్రజాదరణ, సేవా దృక్పథం ఉన్న నాయకులకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన పరిస్థితి.
10. ప్రజాతీర్పే అంతిమం: ఎవరు ఎంత పెత్తనం చెలాయించినా ప్రజాస్వామ్యంలో చివరి నిర్ణయం ఓటర్లదే.

**ప్రజల మనసులు గెలవడమే అసలైన నాయకత్వం!**

ఇన్నాళ్లూ ఎమ్మెల్యేల అండతో, అధికారులపై పలుకుబడితో రాజకీయంగా చక్రం తిప్పిన నాయకులు ప్రత్యక్ష ఎన్నికల్లో తమ వ్యక్తిగత బలాన్ని నిరూపించుకోవాల్సి ఉంటుంది. పదవి ఉన్నప్పుడు సలాం చేసినవారంతా ఎన్నికల్లో ఓట్లు వేస్తారనే గ్యారంటీ లేదు. కార్యకర్తల అసంతృప్తి, ప్రజల్లో వ్యతిరేకత, వ్యక్తిగత వ్యవహారశైలి గెలుపోటములపై ప్రభావం చూపే అవకాశముంది.

రాజకీయాల్లో పెత్తనం చెలాయించడం వేరు.. ప్రజల మనసులు గెలుచుకోవడం వేరు! పార్టీ అండతో పదవి సంపాదించవచ్చు.. కానీ ప్రజల ఆశీస్సులతో పీఠాన్ని అధిరోహించాలంటే కత్తిమీద సామే!

## ఆదిత్య విశ్వవిద్యాలయంలో ఘనంగా 'ఆప్టిస్పార్క్ -- ఇగ్నైట్ ఫిజిక్స్' కార్యక్రమం

ఆప్టిక్స్, ఫోటోనిక్స్‌పై విద్యార్థులకు అవగాహన.. 56 మంది విద్యార్థుల భాగస్వామ్యం



**గండేపల్లి పెన్ పవర్,(సూరంపాలెం), అక్టోబరు 14:** ఆదిత్య విశ్వవిద్యాలయంలోని భౌతిక శాస్త్ర విభాగానికి చెందిన ఆప్టికా విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో 'ఆప్టిస్పార్క్ -- ఇగ్నైట్ ఫిజిక్స్' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థుల్లో ఆప్టిక్స్, ఫోటోనిక్స్, లేజర్లు, కాంతి ఆధారిత సమాచార ప్రసార వ్యవస్థలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలపై అవగాహన, ఆసక్తిని పెంపొందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మొత్తం 56 మంది విద్యార్థులు పాల్గొని తమ విషయ పరిజ్ఞానాన్ని, విమర్శనాత్మక ఆలోచనా నైపుణ్యాలను, శాస్త్రీయ ఆసక్తిని ప్రదర్శించారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ఐదుగురు ఉత్తమ విజేతలను ఎంపిక చేసి, ఆప్టికా విద్యార్థి సభ్యత్వ రుసుములో రాయితీలు అందజేశారు. తద్వారా అంతర్జాతీయ ఆప్టిక్స్, ఫోటోనిక్స్ రంగాలకు చెందిన శాస్త్రవేత్తలు, నిపుణుల సమాజంలో భాగస్వాములు కావడానికి విద్యార్థులను ప్రోత్సహించారు.తరగతి గది బోధనకు మించి నూతన విషయాలను నేర్చుకోవడానికి ఈ కార్యక్రమం విద్యార్థులకు చక్కని అవకాశాన్ని కల్పించింది. అలాగే వారిలో ఆరోగ్యకరమైన పోటీ తత్వాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు దోహదపడింది.

విద్యార్థుల్లో శాస్త్రీయ అభ్యాసం, సృజనాత్మక ఆలోచన, చురుకైన భాగస్వామ్యం, విద్యా నైపుణ్యాలను ప్రోత్సహించడంలో ఆదిత్య విశ్వవిద్యాలయం చూపుతున్న నిబద్ధతకు ఈ కార్యక్రమం నిదర్శనంగా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు.

## ఆదిత్య విశ్వ విద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ లో ఆన్లైన్ సర్టిఫికెట్ కోర్స్



**గండేపల్లి, పెన్ పవర్, అక్టోబర్ 14,**గండేపల్లి మండలం, సూరంపాలెం స్థానిక ఆదిత్య విశ్వ విద్యాలయం, స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో 'పవర్ బి ఐ ఎస్సెన్షియల్స్ : డేటా టు డాష్ బోర్డు' పైన ఆన్లైన్ సర్టిఫికెట్ కోర్సు ను ప్రారంభించినట్లు యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పవర్ బిఐ ఎకో - సిస్టం హాండ్స్ ఆన్ : లోడ్ ఏ సింపుల్ డేటా సెట్ , డేటా విజువలైజేషన్ డేటా మోడలింగ్ కాన్సెప్ట్స్ , ఫండమెంటల్స్ ఆఫ్ దాస్ మరియు పబ్లిషింగ్ అండ్ షేరింగ్ వంటి అంశాలపై తరగతులు నిర్వహిస్తామని ఇవి విద్యార్థులకు ఎంతగానో దోహద పడతాయి అని ప్రో-వైస్ ఛాన్సలర్ డా. రవి తంగజం తెలిపారు. ఈ ఆన్లైన్ కోర్స్ ను అక్టోబర్ 12 నుండి 16 వ తేదీ వరకు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 7 .30 వరకు నిర్వహిస్తున్నారు. రిసోర్స్ పర్సన్ గా డా. కిరణ్మయి వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి , ప్రో వైస్ ఛాన్సలర్ (అకాడెమిక్స్) డా. ఎస్. రమాశ్రీ, రిజిస్ట్రార్ డా. జి. సురేష్ , స్కూల్ ఆఫ్ బిజినెస్ అసోసియేట్ డీన్ డా. సౌజన్య, ఆదిత్య లెర్నింగ్ అకాడమీ కో-ఆర్డినేటర్ డా. ఐ. వీరాంజనేయులు, డిపార్ట్మెంట్ కో-ఆర్డినేటర్ డా. వి. వెంకటేశ్వరావు తో పాటుగా అధ్యాపకులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలి.






-జగ్గంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్, బి తిరుపతిరావు,

**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్,14:** ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని జగ్గంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్,బి తిరుపతిరావు పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బుధవారం కిర్లంపూడి మండలం బూరుగుపూడి, కృష్ణవరం గ్రామాల్లో కిర్లంపూడి ఎంపిడిఓ, బాయిశెట్టి హరికృష్ణ, ఎస్సై, జి సతీష్ లతో కలిసి పోలింగ్ కేంద్రాలను తనిఖీ నిర్వహించారు. స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను సిఐ తిరుపతిరావు ఆదేశించారు. వాటితోపాటు , ఎంపిడిఓ,బాయిశెట్టి హరికృష్ణ బూరుగుపూడి గ్రామంలో స్వర్ణ గ్రామం 1,2 లను తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ సిబ్బంది, స్వర్ణ గ్రామం సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై దాడులు చేయడం మంచి సంస్కృతి కాదు.



- నిందితులందరినీ వెంటనే అరెస్టు చేయాలి
- జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి.
- వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ముదునూరి మురళీకృష్ణంరాజు డిమాండ్.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్,అక్టోబర్, 14:**ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ నిజాలను నిర్భయంగా వెలుగులోకి తెస్తున్న పాత్రికేయులపై దాడులకు పాల్పడడం,మాఫియా శక్తులతో సంబంధాలు పెట్టుకోవడం మంచి సంస్కృతి కాదని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు,ప్రత్తిపాడు వైసీపీ నాయకులు,ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు హితవు పలికారు.బుధవారం ప్రత్తిపాడు మండలం రౌతుపాలెం గ్రామంలో ప్రజాశక్తి' విలేకరి సిగిరెడ్డి రమేష్‌ను ఆయన స్వగృహంలో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకుని, రమేష్‌కు, ఆయన కుటుంబ సభ్యులకు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా మురళీకృష్ణంరాజు మీడియాతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలైన జర్నలిస్టులపై భౌతిక దాడులకు తెగబడడం హేయమైన చర్య అన్నారు. ఈ ఘటనకు సంబంధించి కేవలం పేరుకు మాత్రమే కాకుండా, దాడిలో భాగమైన నిందితులు అందరినీ చట్టప్రకారం తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సమాజంలో నిజాలు రాసే గొంతుకలను నొక్కే ప్రయత్నాలను ఉపేక్షించకూడదన్నారు.

?రాష్ట్రంలో పాత్రికేయులకు పూర్తి రక్షణ కల్పించేలా కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి, జర్నలిస్టులపై దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నానిపల్లి చంటి,బొల్లు నాగేశ్వరరావు ,జువ్వల దొరబాబు ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

## జగ్గంపేట మండలంలో ఎంపీటీసీ రిజర్వేషన్లు ఇవే

**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 14:** స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా మండలాలవారీగా ఎంపీటీసీ రిజర్వేషన్లు విడుదల చేశారు. జగ్గంపేట మండలంలో గోవిందపురం అన్ రిజర్వ్ జనరల్, మన్యంవారిపాలెం అన్ రిజర్వ్ జనరల్ మహిళ, మల్లిశాల 1అన్ రిజర్వ్ జనరల్, మల్లిశాల 2 బిసి, రాజపూడి 1 అన్ రిజర్వ్ జనరల్ మహిళ, రాజపూడి 2 అన్ రిజర్వ్ జనరల్ మహిళ, కాండ్రేగుల బీసీ మహిళ, నరేంద్రపట్నం అన్ రిజర్వ్ జనరల్ మహిళ, మామిడాడ బిసి, ఇర్రిపాక బిసి, గుర్రపాలెం అన్ రిజర్వ్ జనరల్ మహిళ, జె. కొత్తూరు ఎస్సీ మహిళ, జగ్గంపేట 1అన్ రిజర్వ్ జనరల్, జగ్గంపేట 2 అన్ రిజర్వ్ జనరల్ మహిళ, జగ్గంపేట 3అన్ రిజర్వ్ జనరల్, జగ్గంపేట 4 బీసీ, జగ్గంపేట 5అన్ రిజర్వ్ జనరల్, మర్రిపాక ఎస్సీ, రామవరం 1అన్ రిజర్వ్ జనరల్, రామవరం 2 బీసీ మహిళ, కాట్రావులపల్లి 1 బీసీ మహిళ, కాట్రావులపల్లి 2 ఎస్సీ, కాట్రావులపల్లి 3 బిసి మహిళగా రిజర్వేషన్లు ఖరారయ్యాయి.

# వాడపల్లిలో నూతన పుష్కర ఘాట్ నిర్మాణానికి రూ.4.68 కోట్లు మంజూరు

**ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నిమ్మల రామానాయుడుకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కృతజ్ఞతలు**






**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 14** రానున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నూతన పుష్కర ఘాట్ నిర్మాణానికి జలవనరుల శాఖ రూ. 4.68 కోట్లు మంజూరు చేసింది. పుష్కరాల సమయంలో పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఈ నిధులు కేటాయించారు. నూతన పుష్కర ఘాట్ నిర్మాణంతో ప్రస్తుతం ఉన్న ఘాట్లన్నింటినీ కలిపి ఒకే ఘాట్‌గా అభివృద్ధి చేయనున్నారు. దీంతో పుష్కర స్నానాలకు వచ్చే భక్తులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని భావిస్తున్నారు. జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన వాడపల్లికి పుష్కరాల సమయంలో భక్తుల తాకిడి అధికంగా ఉండనున్న నేపథ్యంలో ఘాట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం పట్ల ఎమ్మెల్యే బండారు సత్యానందరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నూతన పుష్కర ఘాట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మున్సిపల్ ఎన్నికలకు సన్నద్ధం అవుతున్న కాంగ్రెస్ పార్టీ...



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబర్ 14:** అమలాపురం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వంటెద్దు బాబి ఆధ్వర్యంలో బుధవారం భాబీ నివాసంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశం జరిగింది. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు కొత్తూరు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు అందరూ సన్నద్ధం కావాలని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఎంపిక చేసి వాళ్ల విజయానికి అందరూ గట్టిగా కృషి చేయాలని, రేపటిలోగా పోటీ చేసే అభ్యర్థులను ఎంపిక చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ మెంబర్ యార్లగడ్డ రవీంద్ర, పీసీసీ మెంబర్ మాచవరపు శివన్నారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు వడ్డీ నాగేశ్వరరావు, కుడిపూడి శ్రీనివాసరావు, ఏలేశ్వరపు రాధాకృష్ణ, రాయుడు వెంకటరమణ, మహబూబ్ షకిల, రాయుడు గంగ భవాని, వాకపల్లి రాంబాబు, దేవరపల్లి రాజేంద్ర బాబు, అరిగెల శ్రీరామ్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించాలి....



శంఖవరం పెన్ పవర్ అక్టోబర్ 14:- రైతులకు ఎరువులు, పురుగు మందులు, విత్తనాల అమ్మకాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరపాలని వర్తకులకు వ్యవసాయ అధికారి పి గాంధీ సూచించారు. శంఖవరం వ్యవసాయాధికారి కార్యాలయంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వర్తకులతో సమావేశం నిర్వహించి రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు నిర్ణీత ధరలకే అందజేసి రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. దుకాణం వద్ద స్టాక్ వివరాలు, ధరల పట్టిక ప్రతీ రోజూ ప్రదర్శించాలని, నిషేధించిన మందులు అమ్మరాదని, నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడమే కాక వారి లైసెన్స్ రద్దుకు సిఫార్సు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఏ ఈ ఓ శ్రీనివాస్, మండలం లోని విత్తన, ఎరువులు, పురుగు మందుల వర్తకులు పాల్గొన్నారు.

## కిర్లంపూడి మండలం ఎంపీటీసీ స్థానాలు రిజర్వేషన్లు ఖరారు

**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్,14:** కిర్లంపూడి మండలం ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్ ఖరారు అయ్యాయి. మండలంలో 21 ఎంపిటిసి స్థానాలు ఉండగా వాటిలో సోమవరం,జనరల్,కృష్ణవరం,జనరల్,బూరుగుపూడి,బి సి,పాలెం/ సోమరాయునిపేట, జనరల్,గోనేడ, జనరల్ మహిళ, రామచంద్రాపురం, జనరల్ మహిళ, ఎస్ తిమ్మాపురం/ భూపాలపట్నం, బీసీ మహిళ,తామరాడ జనరల్ మహిళ, శృంగరాయుని పాలెం, బీసీ మహిళ,గెద్దనాపల్లి,జనరల్,వేలంక, జనరల్ మహిళ, జగపతినగరం 1, జనరల్ జగపతినగరం 2, జనరల్ మహిళ, జగపతినగరం 3, జనరల్ మహిళ జగపతినగరం 4, బీసీ, జగపతినగరం 5, ఎస్సీ,వీరవరం 1, ఎస్సీ మహిళ, వీరవరం 2, ఎస్సీ రాజుపాలెం/ రామకృష్ణాపురం, బీసీ మహిళా, ముక్కొల్లు, బిసి, సింహాద్రిపురం, బిసి లకు కేటాయించారు.

## మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి







- **స్వయం ఉపాధి శిక్షణలతో ఆర్థిక స్వావలంబన సాధించాలి**
- **మహిళల ఆర్థికాభివృద్ధికి ఫౌండేషన్ చేయూత**
- **మంత్రి వాసంశెట్టి సుభాష్**

**కాజులూరు, అక్టోబర్ 14 పెన్ పవర్:** మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ, స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. మహిళలు తమలోని నైపుణ్యాలను ఆదాయ వనరులుగా మలుచుకుని ఆర్థిక స్వావలంబన సాధించడంతో పాటు కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలవాలని ఆకాంక్షించారు. కాజులూరు మండలంలోని వెలుగు కార్యాలయంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన స్వయం ఉపాధి వృత్తి శిక్షణ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. మహిళల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసి, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. మహిళలకు శిక్షణ అందించడంతోనే సరిపెట్టకుండా, వారు సొంతంగా చిన్నతరహా, కుటీర పరిశ్రమలను స్థాపించి విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తామని మంత్రి తెలిపారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసి, తమ నైపుణ్యాలను ఉపాధి అవకాశాలుగా మార్చుకోవాలని సూచించారు. ఈ శిక్షణలో భాగంగా ఫినాయిల్, సర్ఫ్, డిష్‌వాష్ లిక్విడ్ తయారీతో పాటు వ్యాపార నిర్వహణలో మెలకువలు, వ్యాపార విస్తరణ, అభివృద్ధి, మార్కెటింగ్ పద్ధతులు, స్వాట్ అనాలిసిస్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు బ్యాంకు రుణాలు పొందేలా అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. కాజులూరు ఎంపీడీవో జె. రాంబాబు మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధి కల్పనకు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అందిస్తున్న సేవలను ప్రశంసించారు. మహిళలు సంఘాలుగా ఏర్పడి పరస్పర సహకారంతో చిన్నతరహా, కుటీర పరిశ్రమలను స్థాపించి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. ఇటువంటి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని తమ కుటుంబాల అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న మహిళలు మాట్లాడుతూ తమ జీవనోపాధికి ఉపయోగపడే ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందేందుకు కృషి చేస్తామని తెలిపారు. మహిళల అభ్యున్నతికి ప్రోత్సాహం అందిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యంకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కోట తాతబ్బాయి, ప్రముఖ పారిశ్రామికవేత్త, శలపాక నీటి సంఘం అధ్యక్షులు తాడి మాచారెడ్డి (టిఎంఆర్), వెలుగు ఏపీఎం టి. మురళి , డ్వాక్రా మహిళలు, తదితరులు కూటమి పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పాడి రైతులకు 50శాతం సబ్సిడీతో పశువుల దాణా

- పశు వైద్యాధికారిణి డా. వి. దీపిక



**అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబర్ 14:** ప్రభుత్వం పాడి ఉత్పత్తి ని పెంచేందుకు పాడి రైతులకు 50 శాతం సబ్సిడీతో పశువుల దాణాను అందిస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారిణి డా. వి దీపిక సూచించారు.

ఈ సందర్భంగా డాక్టర్ దీపిక మాట్లాడుతూ పాడి పరిశ్రమకు ఆధారం పచ్చి మేత, పశువుల దాణా అని తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో రూ. 1110 విలువగల పశువుల దాణాను కేవలం రూ. 555లకే రైతులకు అందచేస్తున్నామన్నారు. ప్రస్తుతం 28 టన్నులు 560 బస్తాలు మొదటి విడతగా వచ్చాయని అంబాజీపేట, ముక్కామల, చిరతపూడి పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక రైతుకు ఒక బస్తా చొప్పున పంపిణీ జరుగుతుందని అన్నారు. రెండవ విడతలో మరో 560 బస్తాలు వస్తాయని తెలిపారు.

## ఘనంగా 70వ బౌద్ధ ధమ్మం మహోత్సవం



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబర్ 14:** త్రిరత్న బుద్ధ విహార్ లో బుధవారం 70వ బౌద్ధ ధమ్మం మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ముఖ్య అతిథిగా భారత బుద్ధ శాసన వర్ధన కీర్తి గొల్లపల్లి సూర్యారావు పాల్గొని బాబాసాహెబ్ డా అంబేద్కర్ బౌద్ధం ఎందుకు స్వీకరించారో అనే విషయం గురించి చెబుతూ ఈ దేశానికే కాదు, యావత్ ప్రపంచానికే బౌద్ధం అవసరమని చెప్పారు. డా. పిల్లి రాంబాబు మాట్లాడుతూ గౌతమ్ బుద్ధ ఆయన ధర్మం ధమ్మం గురించి విపులంగా తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో త్రిరత్న బుద్ధ విహార్ చైర్మన్ నాగాబత్తుల ప్రసాదరావు, ములపర్తి సత్యనారాయణ, పెనుమల చిట్టిబాబు, పి వి వి సత్యనారాయణ, బాల రవి, కొండేపూడి సత్యనారాయణ, కాశి వెంకటరావు, ధోనిపాటి నాగేశ్వరావు, ఆంజనేయులు, కోడూరి రామ్మూర్తి, జంగా బాబూరావు, ఏ వీ రావ్ , దుర్గా ప్రసాద్, ఐ ఎన్ మల్లేశ్వరరావు, అంబేద్కర్ అభిమానులు, బుద్ధిష్టులు పాల్గొని బుద్ధవంధనం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ విజేతలకు అభినందనలు.




**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబర్ 14:** ఇటీవల కాకినాడలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఛాంపియన్లుగా గెలిసిన హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్ క్రీడాకారులు వాసంశెట్టి మేఘన , గుంటూరు దినేష్ ప్రసాద్ ఒ కొండేటి వేణి మానస్ ల ను అభినందించడానికి ఏర్పాటుచేసిన కార్యక్రమంలో హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్ లైఫ్ మెంబర్ గారపాటి చంద్రశేఖర్ విజేతలకు 8,000/- రూపాయలతో బలమైన పౌష్టికాహారం ప్రోటీన్ డబ్బాలను క్రీడాకారులకు స్పాన్సర్ చేసి అందజేసినారు. క్రీడాకారులు బలమైన ఆహారం తీసుకుంటూ నిత్యం క్రమశిక్షణతో ప్రాక్టీస్ చేయటం వలన విజయాలను అందుపుచ్చుకుంటారని తెలిపి క్రీడాకారులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ అభినందన కార్యక్రమంలో నేషనల్ వెయిట్ లిఫ్టర్స్ మారే వీరేంద్ర, బి.యశ్వంత్, దివ్య తేజ విద్యానికేతన్ స్కూల్ కరస్పాండెంట్ ముమ్మిడి ప్రతాప్ కుమార్, చోడే శంకర్ నారాయణ, సిహెచ్. సత్యనారాయణ మూర్తి, ఆర్. సుభాజీ ఒ హెల్త్ అండ్ ఫిట్న జిమ్ మెంబర్స్ పాల్గొని క్రీడ విజేతలను అభినందించారని కోచ్ కంపాటి వెంకటేశ్వరరావు తెలిపారు.

## లలితాదేవి అలంకరణలో శ్రీ వాసవి అమ్మవారు



**అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబర్ 14:** దేవీ నవరాత్రి మహోత్సవాలలో భాగంగా శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ని భక్తులు లలితాదేవి అలంకరణలో దర్శించుకున్నారు. స్థానిక బస్టాండ్ సమీపంలో వేంచేసియున్న శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉదయం నుండి అధిక సంఖ్యలో భక్తులు లలితాదేవి అలంకరణలో అమ్మవారి ని దర్శించుకున్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం చిన్నారులచే నృత్య ప్రదర్శన, పెద్దలకు దీపాలంకరణ పోటీలు నిర్వహించారు. వాసవి వైశ్య సంఘం అధ్యక్షులు గ్రంధి సాయిబాబు, కార్యదర్శి కడించర్ల అర్జునుడు, కోశాధికారి అప్పన దత్తుడు, కన్వీనర్ అప్పన శ్యామ్, ఉత్సవ కమిటి చైర్మన్ గెల్లి సంతోష్ లు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేసారు.

# వెలిచేరులో పోలీసుల 'పల్లె నిద్ర'.. ప్రజల సమస్యలపై ఆరా






**సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, నూతన చట్టాలపై అవగాహన**

**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 14 :**గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల సమస్యల పరిష్కారం, నేరాల నియంత్రణే లక్ష్యంగా ఆత్రేయపురం పోలీసుల ఆధ్వర్యంలో వెలిచేరు గ్రామంలో బుధవారం'పల్లె నిద్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ ఆదేశాల తో కొత్తపేట డీఎస్పీ ఎస్. మురళీమోహన్ సూచనలతో చేపట్టిన ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.
ఈ కార్యక్రమంలో రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్. విద్యాసాగర్, ఆత్రేయపురం ఏఎస్ఐ బి. శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. గ్రామంలో నెలకొన్న పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలు, అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారంపై గ్రామస్థులతో చర్చించారు.

**నేరాల పట్ల అప్రమత్తత అవసరం**

ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకులు, ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. వ్యక్తిగత బ్యాంకు వివరాలు, ఓటీపీలు ఇతరులకు వెల్లడించకూడదని సూచించారు. అలాగే రోడ్డు భద్రత నియమాలు పాటించడం, నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండటం, పోక్సో చట్టం ప్రాముఖ్యతను గుర్తించడం, సోషల్ మీడియాలో బాధ్యతాయుతంగా వ్యవహరించడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ప్రజల సహకారంతోనే శాంతిభద్రతల పరిరక్షణగ్రామ పరిధిలో ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని అధికారులు కోరారు. గ్రామంలో అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, అసాంఘిక కార్యకలాపాలు లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలు గుర్తించినప్పుడు వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలు తెలియజేసే సమస్యలను పరిశీలించి, వాటి పరిష్కారానికి వేగవంతమైన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.
పోలీసులు నేరుగా గ్రామానికి చేరుకుని ప్రజలతో మాట్లాడటం ద్వారా స్థానిక సమస్యలను తెలుసుకోవడంతో పాటు, నేరాల నివారణపై అవగాహన కల్పించడం 'పల్లె నిద్ర' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఈ సందర్భంగా స్పష్టమైంది. ఈ కార్యక్రమంలో వెలిచేరు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొని గ్రామంలో నెలకొన్న సమస్యలను పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

## శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలి.

-జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్.





**కిర్లంపూడి,పెన్ పవర్,అక్టోబర్ 14:** శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ అన్నారు. మండల కేంద్రమైన కిర్లంపూడి ప్రముఖ పాత్రికేయులు నేదూరి లక్ష్మణరావు నివాసం వద్ద వేంచేసియున్న శ్రీకనక దుర్గమ్మ అమ్మవారిని తుమ్మలపల్లి రమేష్ దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో దాడి చినబుజ్జి, గంధం ప్రభాకర్, గోకేడ ప్రసాద్, కాయల మణికంఠ,అప్పారావు తదితరులు పాల్గొన్నారు. వారితో పాటు కిర్లంపూడి సొసైటీ మాజీ చైర్మన్, జనసేన పార్టీ నాయకులు చదలవాడ బాబి, అనిల్ పార్కింగ్ టైల్స్ అధినేత సేనాపతి కన్నబాబు పలువురు గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, అన్న ప్రసాదములు స్వీకరించారు.

## కూటమి ధర్మాన్ని పాటించాలి.. పార్టీ ఆదేశాల మేరకే అభ్యర్థుల ఎంపిక: ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



**అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబరు 14:** ప్రతి ఒక్కరూ కూటమి ధర్మాన్ని పాటించాలని, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పార్టీ అధిష్ఠానం నుంచి వచ్చే ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సూచించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జనసేన పార్టీ పి. గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ స్థానిక ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పి. గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ కూటమి ధర్మాన్ని పాటించాలని, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పార్టీ అధిష్ఠానం నుంచి వచ్చే ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేయాలని సూచించారు. ఎవరూ స్వతంత్రంగా అభ్యర్థులను ప్రకటించకుండా, పార్టీ నిర్ణయం మేరకు ఎంపికైన అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.
స్థానిక సంస్థల ఎన్నికల్లో 100 శాతం విజయ లక్ష్యంతో ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని, పార్టీ నిర్ణయించిన అభ్యర్థులకు పూర్తి మద్దతు అందించాలని అన్నారు.
ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్తలు, నిర్వాహక దళ్ సభ్యులు, కమిటీ ప్రతినిధులు తమ అభిప్రాయాలను ఎమ్మెల్యే గారికి వివరించారు. సమావేశంలో చర్చించిన అంశాలను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్తలు, నిర్వాహక దళ్ సభ్యులు, సపోర్టింగ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం తూకాల్లో పూర్తి పారదర్శకత పాటించాలి

జెసి అపూర్వ భరత్



**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 14:** జగ్గంపేట మండలంలో కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ విస్తృత తనిఖీలు చేశారు. రాబోయే ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయడమే కాకుండా, ధాన్యం తూకాల్లో పూర్తి పారదర్శకత పాటించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన జగ్గంపేట మండలంలో బియ్యం మిల్లు, చౌక ధరల దుకాణాలు, నిల్వ కేంద్రాలు, రైతు సేవా కేంద్రాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ పర్యటనలో భాగంగా జేసీ మొదటగా శ్రీ బాలాజీ బియ్యం మిల్లును సందర్శించి, మిల్లులోని యంత్రాల పనితీరు, ధాన్యం ఆరబెట్టే యంత్రాల సామర్థ్యం, బియ్యం తయారీ ప్రక్రియను కూలంకషంగా తనిఖీ చేశారు. రాబోయే పంట కాలంలో ధాన్యం కొనుగోళ్ల నిర్వహణకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం సేకరణ సమయానికి ఎలాంటి సాంకేతిక సమస్యలు లేకుండా, సీజన్ ప్రారంభానికి ముందే అన్ని ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేసుకోవాలని మిల్లు నిర్వాహకులకు స్పష్టమైన సూచనలు చేశారు.

## క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి





- క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్తు, ఉపాధి అవకాశాలు
- మత్తు పదార్థాలు, గంజాయికి దూరంగా ఉండాలి
- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సొళ్ల బొజ్జిరెడ్డి పిలుపు
- గంగవరంలో ఘనంగా ప్రారంభమైన దసరా ధమాకా--2026 వాలీబాల్ టోర్నమెంట్

**గంగవరం, పెన్ పవర్ అక్టోబర్ 14:** యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, క్రీడల ద్వారా ఉపాధి అవకాశాలను సైతం పొందవచ్చని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సొళ్ల బొజ్జిరెడ్డి అన్నారు. పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం గంగవరం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న దసరా ధమాకా--2026 వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను బుధవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. సందర్భంగా సొళ్ల బొజ్జిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులు ఎంతోమంది ఉన్నారని, సరైన ప్రోత్సాహం, అవకాశాలు లభిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించగలరని పేర్కొన్నారు. యువత చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, క్రమశిక్షణతో సాధన చేస్తే మంచి భవిష్యత్తును నిర్మించుకోవచ్చని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, యువతలో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని వివరించారు.యువత మత్తు పదార్థాలు, గంజాయి వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆయన ప్రత్యేకంగా పిలుపునిచ్చారు. వ్యసనాలకు బానిసలై విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే దిశగా యువత ముందుకు సాగాలని సూచించారు. క్రీడాస్ఫూర్తిని అలవర్చుకుని గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, స్నేహపూర్వక వాతావరణంలో పోటీల్లో పాల్గొనాలని అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని, యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు టోర్నమెంట్లు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభను నిరూపించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకుడు కుంజం రమేష్ దొర, బీజేపీ నాయకుడు కుంజం చిన్నారావు, జనసేన మండల అధ్యక్షుడు కుంజం సిద్దు, పీసా కార్యదర్శి చిన్నిబాబు, మాజీ సర్పంచ్ కలుముల అక్కమ్మ, వీరభత్తుల ప్రసాద్, గంగవరం మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అమలాపురంలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

**శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా రూట్ మార్చ్**





**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబర్ 14:**రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలు, దసరా ఉత్సవాల నేపథ్యంలో అమలాపురం పట్టణంలో పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పట్టణంలోని నారాయణపేట మున్సిపల్ కాలనీ, మార్కెట్ ఏరియా, ప్రభాకర్ నగర్ తదితర సున్నిత ప్రాంతాల గుండా ఈ మార్చ్ సాగింది.
?ఈ కార్యక్రమంలో అమలాపురం పట్టణ సీఐ పీ. వీరబాబు, పట్టణ ఎస్సై కిషోర్ బాబు, ఆర్ఎస్ఐ ఏసుబాబుతో పాటు పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు, పండగ వాతావరణం దృష్ట్యా పట్టణంలో ఎలాంటి అసెంబ్లీ సంఘటనలు జరగకుండా, శాంతిభద్రతలను పరిరక్షించడమే లక్ష్యంగా ప్రజల్లో ధైర్యాన్ని, నమ్మకాన్ని నింపేందుకు ఈ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.
?అనుమానితుల సమాచారం డయల్ 112కి అందించాలి:
ఈ సందర్భంగా సీఐ పీ. వీరబాబు మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదు. కాలనీల్లో గానీ, బహిరంగ ప్రదేశాల్లో గానీ ఎవరైనా అనుమానిత వ్యక్తులు తిరుగుతున్నా, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలు సేవించే వారి సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు తెలియజేయాలి. అలాగే మహిళలపై జరిగే నేరాలు, వేధింపుల పట్ల కఠినంగా వ్యవహరిస్తాం. ఎలాంటి అత్యవసర పరిస్థితి లేదా సమాచారం ఉన్నా ప్రజలు వెంటనే డయల్ 112 కి కాల్ చేసి సమాచారం అందించాలి అని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గుప్తంగా ఉంచుతామని ఆయన స్పష్టం చేశారు.

## దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కనకదుర్గమ్మకు బోనాలు సమర్పించిన మహిళలు.



-ఏలూరులో 150 మంది మహిళలకు పంపిణీ చేసిన అడ్డాల త్రిమూర్తులు.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, అక్టోబర్,14:**ప్రత్తిపాడు మండలం ఏలూరు గ్రామంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఉత్సవాల్లో భాగంగా శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలు ఎత్తుకుని అమ్మవారికి సమర్పించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా బోనాలు ఎత్తుకున్న 150 మంది మహిళలకు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకుడు అడ్డాల త్రిమూర్తులు చీరలు పంపిణీ చేశారు. పండుగ వేళ మహిళలకు చీరలు అందజేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం అడ్డాల త్రిమూర్తులు మాట్లాడుతూ శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి కృపాకటాక్షాలతో గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రొంగల సత్యనారాయణ, చుక్కా రాంబాబు, జామి హనుమంత్, జామి శ్రీను, గొంప అచ్చిబాబు, రొంగల మణికంఠ, రంది నాయుడు, భవానీ భక్తులు తదితరులు పాల్గొన్నా

# విశ్వ దుర్గేశ్వరి అమ్మవారిని 30 లక్షల నోట్లతో ధనలక్ష్మి అలంకరణ.




**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 14.** దేవి నవరాత్రుల సందర్భంగా .. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, తాడేపల్లిగూడెం పట్టణ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్.. గొర్రెల శ్రీధర్ గారి ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం పట్టణంలో... 17వ వార్డు, విశ్వ దుర్గేశ్వరి పేటలో శ్రీ విశ్వ దుర్గేశ్వరి అమ్మవారిన్ఆలయం నందు

నాల్గవ రోజు శ్రీ విశ్వ దుర్గేశ్వరి అమ్మవారిని ధనలక్ష్మి అమ్మవారి గా తీర్చిదిద్దారు. అమ్మవారి ఆలయాన్ని సుమారుగా ముప్పై లక్షల కొత్త కరెన్సీ నోట్లుతో ఎంతో సుందరంగా అలంకరించి.. వచ్చిన భక్తులందరికీ అమ్మవారు.. దేదీప్యమానంగా, కనులు విందు చేసే విధంగా అమ్మవారు ధనలక్ష్మి అమ్మవారుగా దర్శనమిస్తున్నారు. ఇంత చక్కగా భక్తులు దర్శించుకునే విధంగా ఆలయ కమిటీ సభ్యులు ఆలయం మొత్తాన్ని, గర్భగుడిని, ఉత్సవ విగ్రహం మండపాన్ని, ఎంతో అందంగా ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. పీటల మీద కూర్చున్న దంపతులు కరక రమేష్ శ్రీమతి దివ్య భారతి దంపతులచే మదన్ మోహన్ అగర్వాల్ శ్రీమతి అనిత అగర్వాల్ దంపతులచే ప్రత్యేక పూజ కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు, భవానీలు పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



## 68 లక్షల కొత్త నోట్ల తో శ్రీ బలుసులమ్మ అమ్మవారి అలంకారణ

**500, 200,100, 50, 20,10,5, నాణేలు తో ఆలయ అలంకరణ ప్రత్యేక ఆకర్షణ.**




**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 14.**



తాడేపల్లిగూడెం పట్టణ గ్రామదేవత శ్రీ బలుసులమ్మ అమ్మవారి దేవస్థానంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు 4 రోజు అత్యంత వైభవంగా ధనలక్ష్మి అలంకరణ దర్శనం ఇస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల 4 రోజు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజా కార్యక్రమాలు ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగాయి. అమ్మవారికి కుంకుమ పూజలను నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ఆవుపాలు, పెరుగు, తేనె, వివిధ సుగంధ ద్రవ్యాలు, పలు నదుల పవిత్ర జలాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. వేదమంత్రోచ్చారణలు, ప్రత్యేక పూజలతో ఆలయంలో భక్తిమయ వాతావరణం నెలకొంది.

### ధనలక్ష్మిగా అమ్మవారి దర్శనం

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీ బలుసులమ్మ అమ్మవారు ధనలక్ష్మి కరెన్సీ నోట్లు తో అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అర్చకుల ఆధ్వర్యంలో విశేష పూజలు ఆలయ అర్చకులు ప్రదీప్ శర్మ, గోపీనాథ్ శర్మ, మల్లికార్జున శర్మ అమ్మవారికి నిత్యం విశేష పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలను ఆలయ చైర్మన్ శ్రీరంగం అంజి, ఆలయ ఈఓ బీవీ చంద్రశేఖర్ పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు శ్రీరంగం అంజి, ఆయన తల్లిదండ్రులు శ్రీరంగం సత్యనారాయణ, సావిత్రి దంపతులతో పాటు నీలం సురేష్, జయ కృష్ణ ,దాట్ల జగన్నాథరాజు, కళ్యాణం రామచంద్రరావు, చెన్నం శెట్టి బాలాజీ తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభం కావడంతో శ్రీ బలుసులమ్మ అమ్మవారి ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. రానున్న రోజుల్లో అమ్మవారి వివిధ అలంకారాలు, విశేష పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు

# ఎన్నికల పోలింగ్ కేంద్రాల సౌకర్యాలపై ఇంజినీరింగ్ సిబ్బందితో సమీక్ష



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 14.** తాడేపల్లిగూడెం పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ఎమ్. యేసుబాబు ఇంజినీరింగ్ విభాగ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాబోయే ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని పోలింగ్ కేంద్రాలలో కల్పించాల్సిన కనీస సౌకర్యాలపై చర్చించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, విద్యుత్, ర్యాంపులు, మరుగుదొడ్లు, వాష్ రూమ్ లుబి తదితర సౌకర్యాలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని కమిషనర్ యేసుబాబు ఆదేశించారు. అన్ని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి, అవసరమైన మరమ్మత్తులు, ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఇంజనీర్ వై వెంకటరమణ, అందరూ డిప్యూటీ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు మరియు ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు ఏపీడబ్ల్యూజే వినతి



- ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్, హెల్త్ కార్డులు మంజూరు చేయాలి
- జిల్లా స్థాయి మీడియా సమావేశాల్లో జర్నలిస్టులందరికీ అవకాశం కల్పించాలి
- జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన పోలవరం జిల్లా ఏపీడబ్ల్యూజే యూనియన్ నాయకులు

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్:** పోలవరం జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీడబ్ల్యూజే) యూనియన్ జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్‌ను యూనియన్ ప్రతినిధులు కలిసి జర్నలిస్టుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు అందించేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అందేలా చూడాలని కోరారు.

### మీడియా సమావేశాల్లో అందరికీ సమాన అవకాశం కల్పించాలి

జిల్లా స్థాయిలో నిర్వహించే అధికారిక మీడియా సమావేశాలు, ప్రభుత్వ కార్యక్రమాల్లో అన్ని పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలకు చెందిన జర్నలిస్టులకు సమాన అవకాశాలు కల్పించాలని యూనియన్ నాయకులు కోరారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవ చూపాలని, పెండింగ్‌లో ఉన్న సంక్షేమ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రంపై జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ సానుకూలంగా స్పందించారని, జర్నలిస్టుల సమస్యలను పరిశీలించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు యూనియన్ ప్రతినిధులు తెలిపారు.

### జిల్లా ఎస్పీ చక్రవర్తిని కలిసిన యూనియన్ నాయకులు

అనంతరం పోలవరం జిల్లా ఎస్పీ కె. చక్రవర్తిని ఏపీడబ్ల్యూజే యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలవరం జిల్లా ఏపీడబ్ల్యూజే యూనియన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణమూర్తి, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు వీరబాబు, ఇతర యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.




## బాధిత కుటుంబాల అండగా వడ్డీ రఘురామ్ నాయుడు.

- 60000 వేలు ఆర్థిక సహాయం అందజేత.




**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 14.** తాడేపల్లిగూడెం రూరల్ మండలం వెంకటరమణ గూడెం గ్రామానికి చెందిన బొట్టా ముకేంద్ర రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం అత్యంత విషాదకరం. ఈ దుర్ఘటన గురించి తెలుసుకున్న తాడేపల్లిగూడెం నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వడ్డీ రఘురామ్ నాయుడు గారు బాధిత కుటుంబాన్ని పరామర్శించి (?50,000/- యాభై వేలు రూపాయలు) ఆర్థిక సాయం చేసినారు వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం రూరల్ మండలం జగ్గన్నపేట గ్రామానికి చెందిన కోనపాముల గంగరాజు గారికి పార్థివదేహానికి నివాళులర్పించినారు. మరణించిన విషయం తెలిసి, వారి పార్థివదేహానికి తాడేపల్లిగూడెం నియోజకవర్గం వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వడ్డీ రఘురామ్ నాయుడు వారి నివాసానికి వెళ్లి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి 10000/- పదివేల రూపాయలుఆర్థిక సాయం చేసినారు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా కల్పించారు వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ తీరని దుఃఖాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించినారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

## ఉద్యాన ఆధారిత ఉత్పత్తులు పై శిక్షణా కార్యక్రమాలు




**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 14** జాతీయ ఉద్యాన సమగ్ర అభివృద్ధి మిషన్ 2026-27 కార్యక్రమంలో భాగంగా డా. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉద్యాన రైతులు ఈ రోజు డా॥వై. యస్. ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని వెంకటరామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రంను సందర్శించి, ఉద్యాన ఆధారిత ఉత్పత్తులు, శిక్షణా కార్యక్రమాలు గురించి తెలుసుకొన్నారు. తదనంతరం కెవికె వ్యవసాయ క్షేత్రంలో ఉన్న పుట్టగొడుగుల పెంపకం మరియు తేనెటీగల పెంపక కేంద్రాలను, కెవికె అధిపతి మరియు సీనియర్ శాస్త్రవేత్త డా. సీఎహ్ . కిరణ్ కుమార్ రైతులకు చూపించి వాటి వివరాలను తెలియజేశారు. అంతర పంటల గురించి, మార్కెటింగ్ అవకాశాల గురించి రైతులు అడిగి తెలుసుకున్నారు. ఈ రైతు సందర్శన కార్యక్రమాన్ని అమలాపురం మండల ఉద్యాన అధికారి యమ్. దిలీప్‌కుమార్ సమన్వయం చేసారు. కెవికె శాస్త్రవేత్తలు డా. అర్చన, డా. రేఖ, ఉద్యాన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## గంగవరంలో స్థానిక ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు

- జడ్పీటీసీ ఎస్టీ జనరల్.. ఎంపీపీ ఎస్టీ మహిళకు కేటాయింపు
- ఏడు ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు వెల్లడి
- రిజర్వేషన్ల ఖరారుతో వేడెక్కనున్న స్థానిక రాజకీయాలు
- అభ్యర్థుల ఎంపికపై ప్రధాన పార్టీల దృష్టి.. ఆశావహుల్లో మొదలైన ఎన్నికల సందడి

**గంగవరం, పెన్ పవర్ అక్టోబర్ 14:** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గంలోని గంగవరం మండలంలో రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. రెండో సాధారణ స్థానిక సంస్థల ఎన్నికలు--2026కు సంబంధించి జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్లు ఖరారయ్యాయి. జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ వెల్లడించిన రిజర్వేషన్ల ప్రకారం గంగవరం జడ్పీటీసీ స్థానాన్ని ఎస్టీ జనరల్‌కు, మండల పరిషత్ అధ్యక్ష (ఎంపీపీ) స్థానాన్ని ఎస్టీ మహిళకు కేటాయించారు. దీంతో ప్రధాన రాజకీయ పార్టీల్లో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### ఏడు ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు

గంగవరం మండలంలోని ఏడు ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్ల వివరాలు వెల్లడయ్యాయి. మోహనపురం, మర్రిపాలెం, నెల్లిపూడి ఎంపీటీసీ స్థానాలను ఎస్టీ జనరల్‌కు కేటాయించారు. అక్కొండ స్థానాన్ని అన్‌రిజర్వ్‌డ్ (జనరల్) కేటగిరీకి, అముదాలబంద,మొల్లేరు స్థానాలను ఎస్టీ మహిళలకు రిజర్వు చేశారు. సూరంపాలెం ఎంపీటీసీ స్థానాన్ని అన్‌రిజర్వ్‌డ్ మహిళకు కేటాయించారు. దీంతో మండలంలోని ఏడు ఎంపీటీసీ స్థానాల్లో మూడు ఎస్టీ జనరల్‌కు, రెండు ఎస్టీ మహిళలకు, ఒకటి అన్‌రిజర్వ్‌డ్ జనరల్‌కు, మరొకటి అన్‌రిజర్వ్‌డ్ మహిళకు కేటాయించినట్లయింది.

### ఎంపీపీ పీఠంపై మహిళా నాయకుల దృష్టి

గంగవరం ఎంపీపీ స్థానం ఎస్టీ మహిళకు రిజర్వు కావడంతో మండలంలో మహిళా నాయకత్వానికి ప్రాధాన్యం పెరగనుంది. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన మహిళా ఆశావహులు ఎంపీటీసీ స్థానాల నుంచి పోటీ చేసి మండల పరిషత్ అధ్యక్ష పదవిని దక్కించుకునేందుకు ప్రయత్నించే అవకాశముంది. ఎంపీపీ ఎన్నిక పరోక్ష పద్ధతిలో జరగనున్న నేపథ్యంలో ఎంపీటీసీ స్థానాల్లో గెలుపొందే అభ్యర్థుల సంఖ్య కీలకంగా మారనుంది.

### జడ్పీటీసీ స్థానంపై కూటమి పార్టీల్లో ఆసక్తి

గంగవరం జడ్పీటీసీ స్థానం ఎస్టీ జనరల్‌కు కేటాయించడంతో రాజకీయ పార్టీల్లో అభ్యర్థిత్వంపై ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా కూటమి పొత్తులో భాగంగా ఈ స్థానాన్ని జనసేనకు కేటాయించాలని ఇప్పటికే మండల జనసేన నాయకులు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో రిజర్వేషన్ల ప్రకటన రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు సైతం స్థానిక రాజకీయ పరిస్థితులు, అభ్యర్థుల బలాబలాలపై దృష్టి సారించే అవకాశముంది.

### గ్రామాల్లో మొదలుకానున్న ఎన్నికల సందడి

రిజర్వేషన్ల ఖరారుతో గంగవరం మండలంలోని గ్రామాల్లో స్థానిక ఎన్నికలపై చర్చ మొదలైంది. గత ఎన్నికల ఫలితాలు, అభ్యర్థుల ప్రజాదరణ, స్థానిక సమస్యలు, రాజకీయ పార్టీల బలాబలాలు రాబోయే ఎన్నికల్లో కీలకంగా మారనున్నాయి. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, ఇతర మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలు ఎన్నికల్లో ప్రధాన చర్చనీయాంశాలుగా నిలిచే అవకాశముంది. జడ్పీటీసీ ఎస్టీ జనరల్‌కు, ఎంపీపీ ఎస్టీ మహిళకు రిజర్వు కావడంతో గంగవరం మండలంలో రాజకీయ సమీకరణాలు ఎలా మారతాయి, ప్రధాన పార్టీలు ఎవరిని బరిలోకి దింపుతాయన్నది ఆసక్తికరంగా మారింది.

## ఇకపై ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారానే ఎరువుల విక్రయాలు

- డీలర్లు, రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శిక్షణ




**పెన్ పవర్ ఉంగుటూరు అక్టోబర్ 14:** ఉంగుటూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఇకపై నూతన ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్స్ (ఎఫ్ఎఫ్ఎస్) యాప్ ద్వారానే ఎరువుల విక్రయాలు, సరఫరా చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి డాక్టర్ ఎన్. ప్రవీణ్ కుమార్ తెలిపారు. మంగళవారం ఉంగుటూరు మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఎరువుల డీలర్లు, రైతు సేవా కేంద్రాల సిబ్బందికి ఈ యాప్‌పై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్ఎఫ్ఎస్ యాప్ వినియోగంపై డీలర్లు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఎరువుల విక్రయాలు, సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నూతన విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. రైతులు తమ పంటలకు, అవసరాలకు అనుగుణంగా ఎరువులను వినియోగించేలా అవగాహన కల్పించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో ఉంగుటూరు మండలంలోని ఎరువుల డీలర్లు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

## రూ.52 కోట్లతో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి

సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ , అక్టోబర్ 14:** రాష్ట్రంలోనే నగరాన్ని ప్రముఖ స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దు తామని ఎన్నికలలో ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నామని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. వివిఎల్ పురం పాత లారీ స్టాండ్ వద్ద రూ. 28 కోట్లతో ఇండోర్ మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అరేనా-1కు శంకుస్థాపన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి సహకారంతో 'ఖేలో ఇండియా' ద్వారా రూ.14 కోట్ల నిధులు మంజూరుతో అరేనా-2 పనులు ప్రారంభించా మన్నారు. తాజాగా రూ.28 కోట్లతో ఇండోర్ మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అరేనా-1 నిర్మాణానికి శంకుస్థాపన చేసామన్నారు. ఈ రెండు ప్రాజెక్టులతో మొత్తం రూ.42 కోట్లతో నగరంలో క్రీడా మౌలిక వసతులు అభివృద్ధి చెందనున్నాయన్నారు. అరేనా-3 నిర్మాణానికి కూడా ఖేలో ఇండియా మరో రూ.10 కోట్ల నిధులు సాధించేందుకు ఎంపీ పురందేశ్వరి ప్రయత్నిస్తారని, అవి వస్తే రూ.52 కోట్లతో క్రీడా సముదాయాన్ని అభివృద్ధి చేయవచ్చునన్నారు. సుమారు రెండు ఎకరాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్, మరో మూడు ఎకరాల్లో పార్కింగ్, వాకింగ్ ట్రాక్, జిమ్ సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదనంగా సుమారు 3,000 గజాల స్థలంలో ఫైవ్‌స్టార్ హోటల్ ఏర్పాటుకు అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. .
గత రెండేళ్లలో 140 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి లో-వోల్టేజ్ సమస్యల పరిష్కారించామని తెలిపారు. నగరంలో గత రెండేళ్లలో సుమారు రూ.300 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని, హెచఏఎం విధానంలో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళన, అమృత్ 2.0, క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి వంటి పలు ప్రాజెక్టులు కొనసాగుతు న్నాయని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గమనించి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వార్డుల పునర్విభజనపై 42 అభ్యంతరాల స్వీకరణ

- కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 14:** నగరపాలక సంస్థ పరిధిలో ప్రస్తుతం ఉన్న 50 ఎన్నికల వార్డులను 72 వార్డులుగా పునర్విభజనకు సంబంధించి అభ్యంతరాలపై గడువు నేటితో ముగియగా మొత్తం 42 అభ్యంతరాలు అందినట్లు కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. నగరపాలక సంస్థ లో 11 గ్రామ పంచాయతీల విలీన ప్రక్రియపై ఈనెల 8న నగరపాలక సంస్థ నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. వార్డుల పునర్విభజన సందర్భంగా ఫారం 1 నందు 72 వార్డులకు సంబంధించిన వివరాలను ప్రకటించి అభ్యంతరాలు స్వీకరించగా, ఇప్పటివరకు 42 అభ్యంతరాలు నగరంలోని వివిధ ప్రాంతాల ప్రజలు, ప్రజా ప్రతినిధులు రాజకీయ పార్టీల నుండి అందినట్లు కమిషనర్ వెల్లడించారు. వాటిని సమగ్రంగా పరిశీలించి నిబంధనల మేరకు వార్డులకు సవరణలు చేసి పూర్తి తుది నివేదికను ప్రభుత్వానికి పంపటం జరుగుతుందన్నారు. 16న తుది నోటిఫికేషన్ ఆంధ్రప్రదేశ్ గెజిట్లో ప్రచురిస్తారని తెలియజేశారు.

# నీలవరం గ్రామంలో దోమతెరల పంపిణీ

- దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- మలేరియా, డెంగీ నివారణకు ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి
- దోమతెరలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారిణి డాక్టర్ కె. శ్వేతాదేవి సూచన




**గంగవరం, అక్టోబర్ 14 (పెన్ పవర్):** దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధుల నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ కె. శ్వేతాదేవి సూచించారు. జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా బుధవారం గంగవరం మండలంలోని నీలవరం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రజలకు దోమతెరలను పంపిణీ చేశారు. వైద్యాధికారిణి డాక్టర్ కె. శ్వేతాదేవి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం. మేరీ పర్యవేక్షణలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ జి. సూరిబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో వైద్య సిబ్బంది మాట్లాడుతూ దోమల ద్వారా సంక్రమించే వ్యాధుల పట్ల ప్రజలు నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. ముఖ్యంగా మలేరియా, డెంగీ వంటి వ్యాధుల లక్షణాలను ముందుగానే గుర్తించి సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని వివరించారు. జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. అవసరమైన రక్త పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనల మేరకు చికిత్స పొందాలని తెలిపారు. దోమల నివారణలో పరిసరాల పరిశుభ్రత అత్యంత కీలకమని, ఇళ్ల చుట్టుపక్కల మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. నీటి నిల్వ పాత్రలను ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవడంతో పాటు దోమలు వృద్ధి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. ప్రభుత్వం అందజేస్తున్న దోమతెరలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో దోమతెరలను తప్పనిసరిగా వినియోగించాలని కోరారు. దోమకాటు నుంచి రక్షణ పొందడం ద్వారా మలేరియా వంటి వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో కీటక జనిత వ్యాధుల నివారణకు ప్రజల్లో అవగాహన పెంపొందించడం ఎంతో అవసరమని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఆరోగ్య శాఖ సూచనలను పాటిస్తూ వ్యాధుల నివారణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఎం. త్రిమూర్తులు, ఏఎన్ఎం కె. రత్నకుమారి, ఆశా కార్యకర్త వై. బాలమ్మ, అంగన్వాడీ టీచర్ ఎం. రమణమ్మ, వీవో లీడర్లు, గ్రామ పెద్దలు, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## క్రీస్తు ప్రేమ మానవాళికి ఆదర్శం






- ఆధ్యాత్మిక చైతన్యానికి పాస్టర్ల సేవలు అభినందనీయం
- జర్నీ ఫెలోషిప్ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి
- గంగవరం పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

**గంగవరం, అక్టోబర్ 14 (పెన్ పవర్):** ప్రేమాభిమానాలు, కరుణ, మానవత్వానికి క్రీస్తు ప్రేమ ప్రతీకగా నిలుస్తుందని రాష్ట్ర శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. బుధవారం గంగవరం మండల కేంద్రంలోని జర్నీ ఫెలోషిప్ ప్రార్థన మందిరంలో పాస్టర్ బి. సంతోష్ అధ్యక్షతన నిర్వహించిన మండల పాస్టర్ల ఆత్మీయ సమావేశానికి ఆమె తన భర్త, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయ్ భాస్కర్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మిక చైతన్యానికి పాస్టర్లు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. దైవ సేవకుల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులను నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దైవ సేవకులు ఎం. పాల్, ఎల్. పాల్ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

### పాస్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

మరోవైపు గంగవరం గ్రామంలోని దైవ సన్నిధి రిలాక్స్ సెంటర్‌లో పోలవరం జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బిత్తిరి సంతోష్, గౌరవాధ్యక్షుడు బిషప్ చంటిబాబు, రంపచోడవరం రీజినల్ చైర్మన్ బిషప్ టి. ప్రభుదాస్ ఆధ్వర్యంలో గంగవరం మండల పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పాస్టర్ ఈ. యోసేపు, గౌరవ సలహాదారులుగా కె. ఆనంద్, ఆర్‌డీవీ కుమార్ ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా ఎస్.ఎన్. రాజు, ఉపాధ్యక్షుడిగా కె. అబ్రహం, కార్యదర్శిగా ఎస్. ఎడ్వర్డ్, సంయుక్త కార్యదర్శిగా కె. రాజారెడ్డి, కోశాధికారిగా కె. ఇంద్రయ్య ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా పి. అమూల్య, ఎం. ఆకుల, ఎస్. శ్రీనుబాబు, ఆర్. రాజ్‌కుమార్, ఎం. రమేష్, పి. ఆనంద్, కె. జయరాజు ఎంపికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు.

## ఎంపీటీసీ ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదల

**వై రామవరం/ గుర్తేడు, పెన్ పవర్, అక్టోబర్ 14 :** వై.రామవరం గుర్తేడు మండలాలలో ఎంపీటీసీ ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ జిల్లా కలెక్టర్ విడుదల చేయడం జరిగిందని ఎంపీడీవో కే బాపన్న దొర తెలిపారు.
వై రామవరం మండలంలో నాలుగు ఎంపీటీసీ స్థానాలకు గాను రెండు ఎస్టీ జనరల్, రెండు ఎస్టీ మహిళలకు కేటాయించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా గుర్తుతెడు మండలంలో ఉన్న నాలుగు ఎంపీటీసీ స్థానాలకు గాను రెండు ఎస్టీ జనరల్, రెండు ఎస్టీ మహిళలకు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఎంపీటీసీ ఎన్నికల రిజర్వేషన్ జాబితా రంపచోడవరం అదేవిధంగా ప్రతి గ్రామ పంచాయతీ ఉన్నాయని తెలిపారు.

## గోకవరం మండలంలో మొదలైన ఎన్నికల హీట్...

# తెరపైకి రిజర్వేషన్ల ట్విస్ట్

**ఎంపీటీసీ-సర్పంచ్ లకు అభ్యర్థులు కోసం పార్టీల్లో అంతర్గత సమీక్షలు**

**గోకవరం పెన్ పవర్ అక్టోబర్ 14:-** స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో గోకవరం మండలంలో రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఆశావహులు తమ ప్రయత్నాలు చేసుకుంటుంటే, అన్ని ప్రధాన పార్టీలు గెలుపు గుర్రాల వేటలో పడ్డాయి. క్యాడర్ కంటే క్యాష్, కుల సమీకరణాలే కీలకం
కేవలం కార్యకర్త అనే కాకుండా, ఆర్థికం, సామాజికంగా, కుటుంబ పరంగా బలమైన అభ్యర్థుల కోసం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మరియు కూటమి పార్టీలు సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నాయి. ఇప్పటికే రెండు పార్టీలు మండలంలోని పలు గ్రామాల్లో అంతర్గతంగా సర్వేలు చేయిస్తున్నట్లు సమాచారం.

**పార్టీల వారీగా పరిస్థితి ఇలా...**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ మంత్రి తోట నరసింహం ఇటీవల పార్టీ సంస్థాగత కమిటీల గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమాలతో క్యాడర్ ను యాక్టివ్ చేసే పనిలో నిమగ్నమై మండలంలోని వివిధ గ్రామాల్లో వరుస సమావేశాలు పెట్టి దిశానిర్దేశం చేస్తున్న తరుణంలోనే నోటిఫికేషన్ రావడంతో అభ్యర్థుల ఎంపికపై మరింత లోతుగా సమీక్షలు చేస్తున్నట్లు అయితే అంతర్గతంగా కొంతమంది అయిష్టంతోనూ, కొంతమంది ఇష్టంతోనూ తప్పనిసరి పరిస్థితుల్లో ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

**కూటమి (టిడిపి-జనసేన-బిజెపి)**

తెలుగుదేశం పార్టీ తమ సీనియర్ నాయకులతో సమీక్షల్లో బిజీగా ఉంటే, జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ తమ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎక్కడ పోటీ చేసేది ఉంటే అక్కడ బలాబలాలను బట్టి ముందుకు వెళ్లాలని, కూటమి ధర్మాన్ని పాటిస్తూనే జనసేన మార్కును చాటాలని ఆయన దిశానిర్దేశం చేసినట్లు సమాచారం.

**బిజెపి డైలమా**

భారతీయ జనతా పార్టీ మాత్రం కూటమి పెద్దలు పిలిచి ఏదో ఒక స్థానం ఇస్తారనే ఆశతో స్తబ్దంగా అధిష్టానం ఆదేశాలను శిరసావహించాలని చూస్తున్నారు. ఇప్పటికే మండలంలో బిజెపి రెండు గ్రూపులుగా విడిపోవడంతో "నువ్వా-నేనా" అనే పరిస్థితి నెలకొంది. అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అని వేచి చూసే ధోరణిలో స్థానిక నాయకులు ఉన్నట్లు తెలుస్తోంది.

**రిజర్వేషన్లు మార్చిన లెక్కలు**

ఈసారి ఎన్నికల్లో రిజర్వేషన్లే కీలక ట్విస్ట్ ఇచ్చాయి అనొచ్చు గోకవరం ఎంపీపీ స్థానం మొదట ఓసి జనరల్ అనుకుని ముగ్గురు బలమైన నేతలు బల ప్రదర్శనకు దిగారు. కానీ అది ఓసి మహిళా కావడం తో ఒక్కసారిగా వారంతా పునరాలోచనలో పడ్డారు.

**జడ్పీటీసీ స్థానం**

బిసి మహిళా రిజర్వేషన్ రావడంతో వైఎస్ఆర్ కాంగ్రెస్ లో గత అనుభవం ఉన్న మహిళా నేతల వైపు క్యాడర్ మొగ్గు చూపుతున్నా, వారు సమయాభావం కారణంగా వెనకడుగు వేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే స్థానానికి టిడిపి నుండి గతంలో పనిచేసిన ఒక సీనియర్ నేత తన భార్యను బరిలోకి దించేందుకు సిద్ధంగా ఉన్నారని, అధిష్టానం ఆదేశిస్తే తప్పకుండా పోటీ చేస్తానని తన అనుచరుల వద్ద చెప్పడం ఆయన హుందాతనానికి నిదర్శనంగా చెప్పుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఇప్పుడు జడ్పిటిసి కి ప్రధాన పోటీ కూడా గత జడ్పిటిసి అనుభవాలు ఉన్నవాళ్లే సుంకర శ్రీవల్లి వీరబాబు గత 20 సంవత్సరాలు క్రితం గోకవరంలో జడ్పిటిసిగా పనిచేశారు తాజాగా మండల పరిషత్ అధ్యక్షురాలుగాను పనిచేశారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి మరోసారి జడ్పిటిసిగా ఆమె బరువులో ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. గతంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున గోకవరం జడ్పిటిసిగా పోటీ చేసి విజయం సాధించిన మాజీ జడ్పిటిసి పాలూరి బోసు బాబు ప్రస్తుతం తెలుగుదేశం పార్టీలో ఉన్నారు తన భార్యను ఈసారి జడ్పిటిసిగా బర్లో దింపనున్నట్లు తెలుస్తుంది.

**ఒకేసారి ఎన్నికలు - పార్టీలకు ఊరట**

ఈసారి సర్పంచ్ మరియు ఎంపీటీసీ ఎన్నికలు ఒకే నెలలో, ఒకేసారి జరగడం రాజకీయ పార్టీలకు ఒక విధంగా వెసులుబాటుగా మారింది. ఒక నెల తేడాతో జరిగితే మొదటి ఎన్నికలో ఓడిన వారు రెండో ఎన్నికలో సానుభూతితో పోటీ చేసే అవకాశం ఉండేది. ఇప్పుడు అలాంటి అవకాశం లేకపోవడంతో పార్టీలకు తలనొప్పి తగ్గినట్లయింది. ఇద్దరు ముగ్గురు ఒకే స్థానం కోసం పోటీ పడే పరిస్థితి తగ్గి, సర్దుబాటు చేసుకోవడం పార్టీ ముఖ్య నేతలకు శిరోభారం తగ్గినట్లే అనుకో వచ్చని పలువురు అంటున్నారు.

**ఫైనల్ గా విశ్లేషణ:**

ఏది ఏమైనా గోకవరం మండల పరిషత్ అధ్యక్ష స్థానాన్ని ఈసారి తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకునే అవకాశం మెండుగా ఉందని పలువురు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి సరైన నాయకత్వం, సమన్వయం లోపించడమే దీనికి కారణమని, ఓటు బ్యాంకు ఉన్నా దానిని ఓటు రూపంలో మలుచుకోలేకపోతున్నారనే చర్చ జోరుగా జరుగుతోంది. అధిష్టానం నిర్ణయం వచ్చే వరకు అందరూ వేచి చూసే ధోరణిలోనే ఉన్నారు.

## పేదలకు భరోసాగా ముఖ్యమంత్రి సహాయ నిధి



-33 మంది లబ్ధిదారులకు రూ.40 లక్షల చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్ర వరం, పెన్ పవర్, అక్టోబర్ 14 ప్రజలకు ఆపద సమయంలో ఆర్థిక భరోసా కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. బుధవారం గోరంట్ల కార్యాలయం నందు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా 33 మంది లబ్ధిదారులకు రూ.40 లక్షల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ, అనారోగ్యం, ప్రమాదాలు తదితర అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఊరటనిస్తోందన్నారు. అర్హులైన వారికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.
ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, నియోజకవర్గ పరిశీలకులు శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపీపీ వెలుగుబంటి సత్య ప్రసాద్, రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మత్స్యేటి ప్రసాద్ గంగిన హనుమంతరావు, పిన్నమరెడ్డి ఈశ్వరుడు, పుక్కళ్ల రాజు, పాతూరి రాజేష్, శీలం గోవింద్, రొంపిచర్ల ఆంటోని, ఏడాకుల వెంకటేశ్వరరావు, దుద్దుపూడి రమేష్, బొప్పన నానాజీ, , తాడేపల్లి నాగరాజు, సయ్యద్ ఉమర్, ప్రత్తిపాటి రామారావు చౌదరి, వట్టిపూడి దత్తుడు, పల్లి సాయి, మట్ట శ్రీను, బొప్పననాగేశ్వరరావు, బొప్పన శ్రీను కోరాడ వెంకటేష్, ఎమ్మెస్సార్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com